ఎన్పీడీసీఎల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సత్తిరెడ్డి



మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : టీఈఈ 1104 యూనియన్ ఎన్పీడీసీఎల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జిల్లా కేంద్రంలోని రెడ్డి కాలనీకి చెందిన బొమ్మ సత్తిరెడ్డి నియమితులయ్యారు. శుక్రవారం నిజామాబాద్‌లో జరిగిన సమావేశంలో సత్తిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సత్తి రెడ్డి 33 ఏళ్లుగా విద్యుత్ సంస్థలో పనిచేస్తూ యూనియన్ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా సత్తిరెడ్డికి యూనియన్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రెటరీ సాయిబాబు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

నస్పూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణంలోని ఉప కేంద్రంలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాంచందర్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని నస్పూర్, తీగల్ పహాడ్, సీతారాంపల్లి, హౌసింగ్ బోర్డు కాలనీ, ఆర్ అండ్ ఆర్ కాలనీ, అభినవ కాలనీ, పటేల్ కాలనీ, శ్రీపాద సిటీ, రెడ్డి కాలనీ, ప్రగతి నగర్, రిటైర్మెంట్ కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు అంతరాయానికి సహకరించాలని కోరారు.

హాజీపూర్: హాజీపూర్ మండలంలోని సబ్‌స్టేషన్ పరిధిలో అంతరాయం కలుగుతుందని ఏఈ మహేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మత్తుల కారణంగా హాజీపూర్, టికానపల్లి, పెద్దంపేట, బొద్దుపల్లి, కొండాపూర్, కర్ణమామిడి, రాంపూర్, కొండపల్లి, ధర్మారం పరిధిలో ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కోటపల్లి : కిష్టంపేట నుంచి కోటపల్లికి



నిర్లక్ష్య ధోరణి

- ఎస్‌జీఎఫ్‌ఐ సెక్రెటరీ నియామకంలో జాప్యం
- ఇప్పటికే తొలి షెడ్యూల్ కోల్పోయిన విద్యార్థులు
- మండల పోటీలు లేకుండానే నేరుగా జిల్లాస్థాయికి
- క్రీడల్లో ప్రతిభను కోల్పోతున్న విద్యార్థులు
- తాజా షెడ్యూల్ కోసం ఎదురు చూపు

మంచిర్యాల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయిలో విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి పెంపొందించి, ప్రభుత్వపరంగా తగిన శిక్షణ ఇవ్వడం ద్వారా క్రీడా రంగాల్లో స్థిరపడేందుకు దోహదపడే టోర్నమెంట్ల నిర్వహణ జిల్లాలో నామ్‌కే వాస్తేగా సాగుతోంది. తూతూ మంత్రంగా క్రీడలు నిర్వహిస్తూ మమ అంటున్నారే తప్ప.. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయడంలో జిల్లా క్రీడల విభాగం పూర్తిగా విఫలమైందన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్‌ఐ) క్రీడా పోటీల నిర్వహణలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఎస్‌జీ ఎఫ్‌ఐ తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఆగస్టు మొదటి, రెండో వారంలో మండల స్థాయి టోర్నమెంట్లు పూర్తి కావాలి. మూడో వారంలో జోనల్ (అంతర్ మండల) టోర్నమెంట్‌తో పాటు జిల్లా జట్ల ఎంపిక జరగాలి.

సెప్టెంబరు 2వ వారంలో జిల్లా స్పోర్ట్స్ జోన్ టోర్నమెంట్‌తో పాటు సెలెక్షన్స్, నాలుగో వారంలో రాష్ట్ర స్థాయి జిల్లా స్పోర్ట్స్ జోన్ టోర్నమెంట్‌తో పాటు క్రీడాకారుల సెలెక్షన్లు జరగాల్సి ఉంది. రాష్ట్రస్థాయి జట్ల ఎంపికలో పది ఉమ్మడి జిల్లాల స్పోర్ట్స్ జోన్‌ల క్రీడాకారులు పాల్గొంటారు. ఇవి అక్టోబర్ మొదటి వారంలో జరగాలి. అయితే ఆగస్టు గడిచినా ఇప్పటి వరకు జిల్లాలో మండల స్థాయి క్రీడలు జరుగక పోవడమే జిల్లా క్రీడల విభాగం నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

మండల స్థాయి పోటీలు లేకుండానే..

మండల స్థాయిలో క్రీడా పోటీల నిర్వహణకు ప్రతీ మండలానికి ఒక ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ ఉంటారు. ప్రతి మండలానికి ఒక ఎస్‌జీఎఫ్‌ను నియమించాల్సి ఉంది. ఈ ప్రక్రియ ఇంకా మొదలే కాలేదు. ప్రస్తుతానికి మండలంలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ పీడీలకు ఎస్‌జీఎఫ్ బాధ్యతలు అప్పగించారు. పూర్తి స్థాయి ఎస్‌జీఎఫ్‌ల నియాయకాలు పూర్తయితే తప్ప తొలుత మండల స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించే అవకాశం ఉండదు. ఈ కారణంగానే జిల్లాలో ఏ మండలంలో కూడా తొలి షెడ్యూల్ ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు జరగలేదు. పాఠశాల క్రీడాకారులను నేరుగా జిల్లా స్థాయిలోనే తూతూ మంత్రంగా ఆడిపించారు. మండలాల్లో ప్రత్యేకంగా సెక్రెటరీ నియామకం జరిగి ఉంటే, విద్యార్థులకు అవసరమైన శిక్షణ ఇచ్చి, టోర్నమెంట్‌కు సిద్ధం చేసి ఉండేవారు. దీంతో క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యం వెలికితీసేందుకు దోహదపడేది. అందుకు భిన్నంగా మండల స్థాయిలో..

క్రీడా పోటీలు నిర్వహించకుండానే నేరుగా జిల్లా స్థాయి టోర్నమెంటులో పాల్గొనడం వల్ల ప్రతిభ కనబరిచే అవకాశం విద్యార్థులకు దక్కలే దనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ నియామకం కూడా ఆలస్యం కావడంతో ఇప్పటి వరకు కేవలం ఫుట్‌బాల్, స్విమ్మింగ్ క్రీడలకే పరిమితం అయ్యారు.

కొత్త షెడ్యూల్ ఎప్పుడు..?

ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల నిర్వహణకు కొత్త షెడ్యూల్ ఇంకా ఖరారు కాలేదు. జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీలతో జరిగే సమావేశంలో దీనిని ఖరారు చేస్తారు. క్రీడా పోటీల నిర్వహణపై ఇటీవల జూమ్ సమావేశం మాత్రమే జరిగింది. పూర్తిస్థాయి సన్నాహక సమావేశం జరగక పోవడంతో తాజా షెడ్యూల్...

(తరువాయి 4లో)

అటకెక్కిన తొలి షెడ్యూల్...

జూన్ 27న పాఠశాల విద్యా కమిషనర్ నవీన్ నికోలస్ ప్రకటించిన క్రీడల షెడ్యూల్...రాష్ట్రస్థాయిలో, జిల్లాల స్థాయిలో ఎస్‌జీఎఫ్ సెక్రెటరీల నియామకం జరగకపోవడంతో ఆట కెక్కింది. వాస్తవంగా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీల కాలపరిమితి రెండేళ్లు ఉంటుంది. అది ఈ యేడు మార్చి నెలాఖరుతోనే ముగిసింది. ఆ వెంటనే ఏప్రిల్ లేదా మే నెలలో కొత్తవారి నియామకాల ప్రక్రియ పూర్తికావలసి ఉండగా, ఆగస్టు వరకు జాప్యం చేశారు. జిల్లాలో ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ నియామకం కేవలం పది రోజుల క్రితమే జరిగింది. జిల్లా సెక్రెటరీగా సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ యాకూబ్ ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. సెక్రెటరీ నియామకంలో జాప్యం కారణంగా 2025-26 సంవత్సరానికి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల నిర్వహణకు షెడ్యూల్ జారీ అయినప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు. ఆయా జిల్లాల స్థాయిలో ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల నిర్వహణ బాధ్యత సెక్రెటరీలపై ఉంటుంది. సెక్రెటరీ నియామకం సమయానికి జరుగక పోవడంతో జూన్‌లో జారీ అయిన షెడ్యూల్ బుట్టదాఖలైంది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం
- మంత్రి వివేక్‌వెంకటస్వామి

మందమర్రిటౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు వరదల పట్ల అప్రమత్తత అవసరమని రాష్ట్ర ఉపాధి కల్పన, గనుల, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. శుక్రవారం రాత్రి మందమర్రిలో మంత్రి మాట్లాడారు. వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదు కుంటుందన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రం కోలుకోలేని విధంగా దెబ్బతిందన్నారు. నిరుద్యోగుల ఉపాధి కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ప్రారంభించామన్నారు. రానున్న స్థానిక సంస్థలను దృష్టిలో ఉంచుకుని కార్యకర్తలు పార్టీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. బీఆర్ఎస్, మాజీ సీఎం కేసీఆర్‌పై కవిత లేవనెత్తుతున్న ఆరోపణలకు జవాబు చెప్పాలన్నారు.

అటవీ అధికారులపై గిరిజనుల దాడి

పోడు కోసం వాగ్వాదం

పలువురికి గాయాలు..

కన్నాలను మున్సిపాలిటీలో విలీనం చేయొద్దు

4లో..

ఆర్‌జేడీకి విద్యార్థి సంఘం నాయకుల వినతి

లక్షెట్టిపేట, సెప్టెంబరు, 12(ఆంధ్రజ్యోతి):లక్షెట్టిపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పరిశీలనకు వచ్చిన ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డికి జిల్లాలో నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ యూఎస్‌ఎఫ్‌ఐ నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేయడంతో పాటు టై, బెల్టు పేరిట రికార్డుల పేరిట డబ్బులు వసూలు చేస్తున్నారని ప్రభుత్వం పెట్టిన నిబంధనలు పాటించడం లేదని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి పిట్టల తిరుపతి, జిల్లా సమాయక కార్యదర్శి గీతాంజలి, అంజలి పాల్గొన్నారు.

నిర్లక్ష్యం చేస్తే విధుల నుంచి తొలగిస్తాం

జేపీవోలను ఉద్దేశించి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య



జేపీవోతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రయ్య

దండేపల్లి సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గతంలో వీఆర్వో వ్యవస్థలో చేసిన తప్పిదాలు ఇక్కడ చేస్తే ఉద్యోగం నుంచి తొలగించే అవకాశం ఉందని, జేపీవో తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య అన్నారు. శుక్రవారం దండేపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. నూతనంగా నియమితులైన జేపీవోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రెవెన్యూ ఫైల్స్ రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం భూ భారతి పకడ్బందీగా అమలు చేసి, ఈ చట్టంపై పూర్తిగా అవగాహన పెంచుకోవాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. భూభారతి చట్టంపై అవగాహన పెంచుకొని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ చుంచు మాధవి, ఆర్ఐ బొద్దుల భూమన్న, రెవెన్యూ సిబ్బంది, జేపీవోలు పాల్గొన్నారు.

జన్నారం: భూభారతిలోని సమస్యలను వెనువెంట పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ) చంద్రయ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. భూభారతిలో పెండింగ్‌లో ఉన్న ప్రతి సమస్యను పరిష్కరించాలని రైతులకు ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రామ్మోహన్, ఆర్ఐలు భానుచందర్ ఉన్నారు.

జిల్లాలో మోస్తరు వర్షపాతం నమోదు

మంచిర్యాల, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం 15.9 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా చెన్నూర్‌లో 57.6 మిల్లీ మీటర్లు, కోటపల్లి మండలంలో 50.0, హాజీపూర్‌లో 22.4, లక్షెట్టిపేటలో 22.2, మంచిర్యాలలో 18.8, జన్నారంలో 11.4 మిల్లీమీటర్లు, కన్నెపల్లిలో 9.4, దండేపల్లిలో 8.2 మందమర్రిలో 7.8 మిల్లీ మీటర్ల, వర్షపాతం నమోదైంది.

మందమర్రిటౌన్ : మందమర్రి మండల వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మార్కెట్ సెంటర్‌లోని వరదనీరు పెద్ద ఎత్తున నిలిచిపోయింది. 6గంటల నుంచి ఎడతెరపిలేకుండా వ్యాపార దుకాణదారులు ఇబ్బందులు పడ్డారు. స్థానిక కోల్‌బెల్ట్‌పై వరదనీరు ప్రవ హించింది. లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి.

రేషన్ బియ్యం పట్టివేత

దండేపల్లి సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం నంబాల గ్రామంలో బండ సురేష్ అనే వ్యాపారి ఇంట్లో నిల్వ ఉంచిన 7క్వింటాళ్ల 50 కిలో రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు దండేపల్లి ఎస్సై ఎండి తహసీనోద్దీన్ తెలిపారు. పలు గ్రామాలోని కోనుగోలు చేసిన రేషన్ బియ్యంను తరలిస్తుండగా, సురేష్ ఇంటి వద్ద వాహనంలో ఉన్న 7 క్వింటళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. సురేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

దేశ రక్షణ బీజేపీతోనే సాధ్యం

- వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం
- ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్



వెరబెల్లి రఘునాథ్‌కు స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : దేశ రక్షణ బీజేపీతోనే సాధ్యమని, పార్టీలో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం లభిస్తుందని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ పేర్కొన్నారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియామకమైన తర్వాత మొదటిసారిగా మంచిర్యాలకు వచ్చిన వెరబెల్లి రఘునాథ్ అభినందన సభలో ఎంపీ పాల్గొన్నారు. కార్యకర్తల బైక్ ర్యాలీతో బీజేపీ శ్రేణులు రఘునాథ్‌కు ఘనంగా స్వాగతం పలికారు. ఐబీ చౌరస్తాలోని హనుమాన్ విగ్రహం వద్ద ఆదిలాబాద్ ఎంపీ నగేష్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, మాజీ ఎంపీ బోర్లకుంట వెంకటేష్‌నేతతో కలిసి హనుమాన్ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీ, ఎమ్మెల్యేలకు బీజేపీ నాయకులు భారీ గజమాలతో స్వాగతం పలికారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ నేతృత్వంలో పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కాలేజీ రోడ్డులోని పద్మనాయక ఫంక్షన్‌హాలులో ఏర్పాటు చేసిన అభినందన సభలో వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. దేశ రక్షణకు బీజేపీ రక్షణ కవచంలా ఉంటుందన్నారు. ప్రజాభీష్టం మేరకే బీజేపీ పరిపాలన ఉంటుందని, అవినీతి, అక్రమాలు ఉండవన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా చేసింది శూన్యమన్నారు. అనంతరం రఘునాథ్ మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బీజేపీ కంచుకోటగా చెప్పుకోవచ్చన్నారు. కార్యకర్తల కృషి వల్లనే తాను ఈ స్థాయికి వచ్చానని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుందన్నారు. తాను చేసిన పోరాటం ద్వారా మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో వందేభారత్ రైలు ఆగేలా కేంద్రం నిర్ణయం తీసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోనె శ్యాంసుందర్‌రావు, కొయ్యల ఏమాజీ, శ్రీశైలం, పెద్దపల్లి పురుషోత్తం, మున్నారాజాసిసోడియా, గాజులముకేష్‌గౌడ్, జోగుల శ్రీదేవి, సత్తయ్య, కమలాకర్‌రావు, కోడి రమేష్, వెంకటకృష్ణ, రమేష్, వెంకటేశ్వర్‌రావు, అశోక్, కృష్ణమూర్తి, తిరుపతి, శ్రీధర్, సంతోష్, జయశ్రీ, సురేఖ పాల్గొన్నారు.

నస్పూర్‌లో ఘన స్వాగతం

నస్పూర్ : బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికై తొలి సారిగా జిల్లాకు వచ్చిన వెరబెల్లి రఘునాథ్‌కు శుక్రవారం నస్పూర్ పట్టణం లో బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. కార్యకర్తలు, నాయకులు పూల మాలలు వేసి శాలువలతో సత్కరించారు. తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాలలు వేసి ర్యాలీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, మాజీ ఎంపీ వెంకటేశ్ నేత, నస్పూర్ పట్టణ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

డీఎంహెచ్‌వో అనిత

లక్షెట్టిపేట, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రికి వచ్చే రోగులక సిబ్బంది మంచి మెరుగైన వైద్య సేవలను అందించాలని డీఎంఅండ్ హెచ్‌వో అనిత వైద్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం లక్షెట్టిపేట పట్టణంలోని 30 పడకల ఆసుపత్రిని డీఎంహెచ్‌వో ఆకస్మికంగా పరిశీలించారు. ఆసుపత్రిలోని రిసెప్షన్, ఫార్మసి, ల్యాబ్, వార్డులతో పాటు ఆసుపత్రిలోని పలు రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ ఆకుల శ్రీనివాస్, వైద్యులు సురేష్, కృష్ణ, స్రవంతి, పవిత్ర ఉన్నారు.

వ్యాధులపై ప్రజలను అప్రమత్తంగా ఉంచాలి



దండేపల్లిలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో అనిత

దండేపల్లి సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): డెంగీ, మల్లేరియా చికెన్‌గున్యా లాంటి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలందరిని అప్రమత్తంగా ఉంచాలని డీఎంహెచ్‌వో అనిత వైద్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం దండేపల్లి మండలం తాళ్లపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేసి ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య, వైద్య సేవలు, రోగుల పట్ల వ్యవహరించే తీరును ఆమె పరిశీలించారు. రోగులకు మె రుగైన వైద్య సేవలను అందించే విధంగా కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ కాంత్రికుమార్ పాటు సిబ్బంది ఉన్నారు.

హాస్టల్ వార్డెన్‌లపై ఫిర్యాదు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ బీసీ హాస్టళ్లలో పనిచేస్తున్న వార్డెన్‌లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం పీడీఎస్‌యూ నాయకులు హైదరాబాద్‌లోని సంక్షేమ భవన్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ కమిషనర్‌లకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ దొనబండ హాస్టల్‌లో పని చేస్తున్న వార్డెన్ సురేష్ విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, సమయ పాలన పాటించడం లేదన్నారు. లక్షెట్టిపేట మండలంలోని బీసీ పోస్టు మెట్రిక్ హాస్టల్ వార్డెన్ బొద్దు శ్రీనివాస్ విధుల పట్ల నిర్లక్ష్యం చేయడమే కాకుండా విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడన్నారు. మంచిర్యాలలోని సాయికుంట గిరిజన ఆశ్రమ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న హెచ్‌ఎం నైతం శ్రీనివాస్ విద్యార్థులు, టీచర్ల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని, అతనిపై పోక్సో కేసు నమోదైనా తొలగించకుండా ఇంకో పాఠశాలకు బదిలీ చేశారని వెంటనే ఇతన్ని విధుల నుంచి తొలగించాలన్నారు. నాయకులు సికిందర్, కార్తీక్ పాల్గొన్నారు.

వందేభారత్ రైలు హాల్టింగ్ హర్షణీయం

టీజీఈజేసీ జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి



సమావేశంలో మాట్లాడుతున్న టీజీఈజేసీ గడియారం శ్రీహరి

మంచిర్యాలక్రైం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వందేభారత్ ట్రైన్ మంచిర్యాలలో హాల్టింగ్ ఇవ్వడం హర్షణీయమని టీజీఈజేసీ జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి అన్నారు. టీఎస్‌జీవో భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంచిర్యాల పరిసర ప్రాంత విద్యార్థులకు, వ్యాపారస్తులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. హాల్టింగ్‌కు కృషి చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి, మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీ క్రిష్ణ, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, రైల్వే ఉన్నతాధికారులకు జిల్లా జేఏసీ తరుపున అభినందనలు తెలిపారు. సెక్రెటరీ జనరల్ వనజరెడ్డి, కో చైర్మన్‌లు చక్రపాణి, కృష్ణ, సుభాష్, సుమిత్, సంజీవ్, పాల్గొన్నారు.

శుద్ధమైన తాగునీటిని సరఫరా చేయాలి

జైపూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వాటర్ ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయించి శుద్ధమైన తాగునీటిని సరఫరా చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఇందారం గ్రామపంచాయతీలో పర్యటించారు. పారిశుధ్య పనులను పరిశీలించి ప్లాస్టిక్ వ్యర్థాలు, కవర్లు, చెత్తా లేకుండా చూడాలన్నారు. మురికి కాలువల్లో గడ్డి లేకుండా చూడాలని, నీరు నిల్వ లేకుండా తొలగించాలన్నారు. అవసరమైన ప్రదేశాల్లో బయోలార్వా స్ప్రే చేయించాలని కార్యదర్శి సుమన్‌ను ఆదేశించారు. ప్రతి రోజు గ్రామాల్లో పారిశుధ్య పనులను ముమ్మరంగా నిర్వహించాలని, తడి పొడి చెత్తను వేరుగా సేకరించి కంపోస్టు షెడ్‌కు తరలించాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా పారిశుధ్య పనులను నిర్వహించాలన్నారు. ఆయనవెంట కారోబార్ బద్రి, బషీర్, సిబ్బంది ఉన్నారు.



ఇందారంలో పారిశుధ్యపనులను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

జైపూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి బాల బాలికల సబ్ జూనియర్ ఆట్యాపాట్య పోటీల్లో జైపూర్ గురుకుల బాలుర విద్యార్థులు ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ కోల నాగేశ్వర్‌రావు శుక్రవారం తెలిపారు. ఈ నెల 19 నుంచి 21 వరకు మహారాష్ట్రలోని గుల్దానాలో జరిగే 32వ బాయ్స్ సబ్ జూనియర్ ఆట్యపాట్య నేషనల్ పోటీల్లో తునరికారి అంజిత్, బోర్లకుంట సాయిసహస్ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

విద్యార్థులను సీనియర్ వైస్ ప్రిన్సిపల్ స్రవంతి, జూనియర్ వైస్ ప్రిన్సిపల్ మహిపాల్, పీడీ సంతోష్, పీఈటీ రత్నం శ్రీనివాస్‌లు అభినందించారు.

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలి

వరంగల్ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి



శిక్షణ తరగతులో మాట్లాడుతున్న ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి

దండేపల్లి సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యారులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని, డిజిటల్ లర్నింగ్‌ను పెంపొందించుకొని చక్కటి విద్యా బోధన అందించాలని వరంగల్ ఆర్‌జేడీ (రివిజనల్ డైరెక్టర్) సత్య నారాయణరెడ్డి కోరారు. శుక్రవారం దండేపల్లి ప్రభుత్వ ఉన్న త పాఠశాలోని లక్షెట్టిపేట, జన్నారం, దండేపల్లి మండ లాల భౌతిక రసాయన శాస్త్ర స్కూల్ కాంప్లెక్స్ ఉపా ధ్యాయుల శిక్షణ తరగతులను ఆయన తనిఖీ చేశా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ నిర్ణయించేది ఉపాధ్యాయులేనని, వారి అర్థమయ్యే రీతిలో విద్యాబోధన అందించాలన్నారు. సర్కార్ బడిలో చదువుకునే ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం బయోసైన్స్ కాంప్లెక్స్ మీటింగ్‌కు హాజరై వివిధ అంశాలను ఉపాధ్యాయులతో చర్చించి సలహాలు సూచనలు అందించారు. కార్యక్రమంలో స్థానిక కాంప్లెక్స్ హెచ్‌ఎం సంగర్స్ రాజేశ్వర్ రావు, ఆర్పీలు అప్పాల మ నోహర్, వేణుగోపాల్, శ్రీనివాస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదవాలి

లక్షెట్టిపేట: 10వ తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే ఒక ప్రణాళికను రూపొందించుకుని ఉత్తమ ఫలితాలు సాధిం చేందుకు కృషి చేయాలని వరంగల్ రివిజనల్ డైరెక్టర్ సత్యనా రాయణరెడ్డి అన్నారు. లక్షెట్టిపేట పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలంటే విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి అందుకు అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. ఈ ఏడాది హాజరు పట్టికలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో ఉన్న భవిత కేంద్రం సందర్శించారు. ఈకార్యక్రమంలో మండల విద్యాధికారి శైలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి


రవి(ఫైల్)

లక్షెట్టిపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మండలం ఎల్లారం గ్రామానికి చెందిన రేఖేందర్ రవి(42) అనే లారీ డ్రైవర్ వరంగల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు లక్షెట్టిపేట ఎస్సై గోపతి సురేష్ శుక్రవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం రవి ఆరేళ్ల క్రితం ఒక లారీ ఫైనాన్స్‌లో కొనుగోలు చేసాడు. తను తీసుకున్న ఫైనాన్స్ మొత్తం కట్టడంతో పాటు ఇటీవల తన స్వంత అవసరాల నిమిత్తం లారీని కూడా అమ్మేసాడు. తాను ఫైనాన్స్‌లో లారీ కొనుగోలు సమయంలో తన బంధువు అయిన ఎల్లారం గ్రామానికి చెందిన రాజు అనే వ్యక్తి కూడా ఇదే ఫైనాన్స్‌లో లారీని కొన్నాడు. రాజు ఫైనాన్స్ కట్టక పోవడంతో జమానత్‌గా ఉన్న రవి లారీ క్లియరెన్స్ కాగితాలు ఫైనాన్స్ వాళ్లు ఇవ్వలేదు. దీంతో ఈనెల 9వ తేదీన ఫైనాన్స్ డబ్బులు చెల్లించాలని రవి రాజు ఇంటికి వెళ్లి నిలదీయడంతో తాను ఫైనాన్స్ కట్టను ఏంచేసుకుంటావో చేసుకో అని రాజు తిట్టాడు. దీంతో మనస్థాపానికి గురైన రవి ఇంటికి వచ్చి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కొడుకు రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

నస్పూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాయల్ టాకిస్ సమీపంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో పట్టణానికి చెందిన కస్తూరి గోపి (46) అనే వ్యక్తి తీవ్ర గాయాలపాలై మృతి చెందినట్లు ఎస్సై జితేందర్ తెలిపారు. గోపి పని నిమిత్తం తెలంగాణ నగర్‌కు వెళ్లి తిరిగి రైస్ మిల్లు రోడ్డులోని తన ఇంటికి నడుచుకుంటూ వెళుతున్నాడు. ఈ క్రమంలో వేగంగా వచ్చిన వాహనం గోపిని ఢీకొంది. స్థానికులు 108 ద్వారా మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందించే లోపే మృతి చెందాడు. గోపి కుమారుడు అఖిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జితేందర్ తెలిపారు.

పాము కాటుతో ఎద్దు ..

చెన్నూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కుమ్మరి బొగుడ కాలనీ బజ్జూరి శ్రావణ్ అనే రైతుకు చెందిన ఎద్దు శుక్రవారం పాము కాటుకు గురై మృతి చెందింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం ఉదయం వ్యవసాయ పనుల నిమిత్తం చేనుకు వెళ్లి అరక కట్టి పనిచేస్తున్న సమయంలో విష సర్పం ఎద్దును కాటు వేయడంతో ఎద్దు అక్కడికక్కడే మృతి చెందిందని తెలిపాడు. ఎద్దు విలువ సుమారు రూ. 80 వేలు ఉంటుందని నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరాడు.

అటవీ అధికారులపై గిరిజనుల దాడి

పోడు కోసం వాగ్వాదం

పలువురికి గాయాలు..పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు


ఫారెస్టు సిబ్బందిపై కారం పోడి చల్లిన గిరిజనులు

దండేపల్లి సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పోడు వ్యవసాయం కోసం అటవీశాఖాధికారులపై కొందరు గిరిజనులు శుక్రవారం దాడికి పాల్పడ్డాడు. దీంతో అధికారులకు తీవ్ర గాయాలు కావడంతో వారిని ఆస్పత్రికి తరలించారు. పోడు వ్యవసాయం కోసం కొంత కాలంగా తాళ్లపేట అటవీరెంజ్ పరిధిలోని లింగాపూర్ అటవీ రిజర్వ్ ఫారెస్టులో 380 కంపార్ట్‌మెంట్‌లో ఆదివాసి గిరిజనులు, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది మధ్య వాగ్వాదం చోటు చేసుకుంటోంది. శుక్రవారం లింగాపూర్ అటవీ బీట్‌లో గిరిజనులు, అటవీ సిబ్బంది మధ్య మళ్లీ వాగ్వాదం జరిగింది. ముం దస్తు ప్రణాళికతో ఉద్దేశపూర్వకంగా మండలంలోని ధమ్మనపేట, మామిడిగూడ చెందిన గిరిజనులు అటవీ శాఖాధికారులపై తిరగబడ్డారు. కాలం చల్లి కొడవళ్లతో దాడి చేశారు. విధులో ఉన్న ఫారెస్టు సిబ్బంది బాలకృష్ణ, సెక్షన్ అఫీసర్, పరమేశ్వర్ బీట్ ఆఫీసర్, రాజేందర్ బేస్ క్యాంపు వాచర్‌లకు గాయాలైనట్లు తాళ్లపేట ఎఫ్ఆర్‌వో సుష్మరావు తెలిపారు. సిబ్బందిపై దాడికి పాల్పడ్డ వారిపై దండేపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎఫ్ఆర్‌వో సుష్మరావు తెలిపారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

» కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఓపెన్‌స్కూల్ సొసైటీ ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధితశాఖల అధికారులతో పరీక్షల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పరీక్షల నిర్వహణకు తగు ఏర్పాట్లు చేయాలని ఓపెన్ ఎస్సెస్సీ పరీక్ష నిర్వహణకు జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ఇంటర్ కోసం జన్కాపూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఓపెన్ టెన్త్‌లో 145 మంది అభ్యర్థులు, ఇంటర్‌లో 63 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతారని అన్నారు. ఈనెల 22 నుండి 28 వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. టెన్త్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్ పరీక్షలు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయింత్రం 5:30 గంటల వరకు ఉంటాయని తెలిపారు. పరీక్ష సమయానికి అనుగుణంగా ఆర్టీసీ అధికారులు బస్సులను నడపాలని తపాలా శాఖ ఆధ్వర్యంలో జవాబు పత్రాలను తరలించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ప్రశ్న, జవాబు పత్రాలను స్థానిక పోలీసు స్టేషన్‌లో భద్రపరచాలని తెలిపారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో లోకేశ్వర్‌రావు, జిల్లా పరీక్షల సహాయ కమిషనర్ ఉదయ్‌బాబు, విద్యుత్ శాఖ ఎస్ఈ శేషారావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

తిర్యాణి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిన్నెధరి ఆశ్రమ పాఠశాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందించే అన్ని సౌకర్యాలు ఉపయోగించుకొని భవిష్యత్‌లో ఉన్నత స్థానంలో నిలువలన్నారు. అనంతరం విద్యార్థులను పలు సబ్జెక్టులలో పలు ప్రశ్నలను అడిగి విషయ పరిజ్ఞానాన్ని తెలుసుకున్నారు. వర్షాకాలం సీజన్ ఉన్నందున విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో ఉమర్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో మల్లేష్, హెచ్ఎం కృష్ణారావు పాల్గొన్నారు.

విద్యార్థినులకు అవగాహన

బెజ్జూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం షీటీం సేవలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీటీం ఏఎస్ఐ సునీత విద్యార్థినులకు భద్రతా చట్టాలు, ఆపద సమయంలో ఎలా స్పందించాలి, డయల్100, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఎం ఈవో సునీత, ప్రత్యేక అధికారి అరుణ,షీటీం సభ్యులు రమాదేవి, స్వప్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

కాగజ్‌నగర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): షూటింగ్ బాల్ అండర్-17 విభాగంలో కాగజ్‌నగర్ విశ్వశాంతి పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి సాయి కృష్ణ రా: స్థాయి పోటీలకు ఎంపికైనట్టు కరస్పాండెంట్ లంక కృష్ణ ప్రసాద్, పీఈటీ శంకర్ తెలిపారు. షూటింగ్ బాల్ పోటీలో ఆసిఫాబాద్‌లో నిర్వహించిన ఎంపిక పోటీల్లో సాయి ఎంపికైనట్లు తెలిపారు.

కన్నాలను మున్సిపాలిటీలో విలీనం చేయొద్దు

బెల్లంపల్లి, సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి మండలంలోని కన్నాల గ్రామ పంచాయతీని మున్సిపాలిటిలో విలీనం చేయవద్దని కోరుతూ శుక్రవారం సబ్‌కలెక్టర్ మనోజ్‌కు నాయకులు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కన్నాల గ్రామంలో దాదాపు 80శాతం మందికిపైగా ఉపాధిహామీ పథకం కింద వంద రోజుల పని నుంచి వచ్చే భత్యంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని అన్నారు. మున్సిపాలిటిలో విలీనం చేస్తే ఉపాధి హామీ పథకం వర్తించదని జీవనోపాధి ఇబ్బందిగా మారుతుందన్నారు. అలాగే మున్సిపాలిటిలో కన్నాల గ్రామాన్ని విలీనం చేస్తే గ్రామస్తులకు ఇతరత్ర ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి, మాజీ సర్పంచ్ అనిత, నాయకులు భరత్, రాజేశం, చంద్రమౌళి, మల్లేశ్, నర్సయ్యలు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

ఫొటోగ్రాఫర్లు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని సబ్‌కలెక్టర్ మనోజ్ అన్నారు. శుక్రవారం ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫొటో ఎగ్జిబీషన్ వాల్‌పోస్టర్లు విడుదల చేసి మాట్లాడారు.

సాంకేతిక పరిజ్ఞానంతో ఫొటోగ్రఫీ పూర్తిగా మారిందన్నారు. ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా కొత్తపరికరాలు డిజిటల్ టెక్నాలజీలు ప్రజలకు చేరువయ్యేలా దోహదపడుతాయన్నారు. యువత ఫొటోగ్రఫీ రంగాన్ని ఎంచుకోవడం ద్వారా మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ నెల 19, 20, 21న హైదరాబాద్‌లో నిర్వహించే ఫొటో ఎగ్జిబీషన్‌కు ఆసక్తి గల యువకులు పాల్గొనాలని సూచించారు. ఫొటో అండ్ వీడియోగ్రాఫర్లు కుంబాల రాజేశ్, తిరుపతి, శ్రీనివాస్, వేణు, విజయ్ పాల్గొన్నారు.


సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు, నాయకులు

సంక్షిప్త సమాచారం

చెన్నూరు : మండలలోని కొమ్మెర 33 కేవీ లైన్, సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించే పనులు ఉన్నందున శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

●మండలంలోరి ఆస్నాద గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం అప్పుడే మంచిగుండే కార్యక్రమాన్ని న్విహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని వివరాలు నమోదు చేసుకున్నారు.

కోటపల్లి : మండలంలోని సర్వాయిపేట గ్రామంలో అప్పుడే మంచిగుండే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు గడపగడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు నారాయణ, బాపునాయక్ పాల్గొన్నారు.

మందమర్రిరూరల్ : ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ మాజీ జడ్పీటీసీ వేల్పుల రవి పేర్కొన్నారు. శుక్రవారం ఆదిల్‌పేట గ్రామంలో అప్పుడే బాగుండే కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ వైస్ ఎంపీపీ రాజ్ కుమార్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

మందమర్రిటౌన్ : తెలంగాణలోనే పూలను పూజించే ఆరాధించే ఏకైక పండగ బతుకమ్మ పండగ అని అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు బండి సదానందం యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం మందమర్రిలో బతుకమ్మ పాట చిత్రీకరణను ప్రారంభించి మాట్లాడారు.

మందమర్రిటౌన్ : పట్టణంలోని రాళ్ల వాగుపై వంతెన నిర్మించాలని టీడీపీ నాయకులు మందమర్రి జీఎం రాధాకృష్ణకు విన్నవించారు. శుక్రవారం కార్యాలయంలో జీఎంను కలిసి సమస్యలను విన్నవించారు. టీడీపీ నాయకులు రాజేష్, సంధ్య, సత్యానారాయణ, రంగనాద్, గోపాల్ పాల్గొన్నారు.

మందమర్రిరూరల్ : బొక్కలగుట్టలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ఎంపీడీవో రాజేశ్వర్ ఏకరూప దుస్తులు అందజేశారు.

జన్నారం: చింతగూడ, కిష్టాపూర్ గ్రామాల్లో రైతులు పండించిన కూరగాయల తోటలను ఉద్యావన శాఖ అధికారిణి సహజ సందర్శించారు. బీరకాయ, కాకరకాయ పంటల దిగుబడిపై అవగాహన కల్పించారు.

ఉపముఖ్యమంత్రికి సన్మానం

మందమర్రిటౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్కను శుక్రవారం ఐఎన్‌టీయూసీ నాయకులు హైద్రాబాద్‌లో కలిశారు. యూనియన్ సెక్రటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్ నేతృత్వంలో కలిశారు. కార్మికుల సమస్యలపై ఉపముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. నాయకులు కాంపెల్లి సమ్మయ్య, రాంశెట్టినరేందర్, దేవి భూమయ్య పాల్గొన్నారు.

మొబైల్ ల్యాబ్‌తో విద్యార్థులకు ప్రయోజనం

జైపూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మొబైల్ ల్యాబ్‌తో విద్యార్థులకు అనేక ప్రయోజనాలున్నాయని జిల్లా సైన్స్ అధికారి రాజగోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ముదిగుంట ప్రభుత్వ పాఠశాలలో సేవా భారతి తెలంగాణ జిజ్ఞాస ప్రయోగశాల ఆధ్వర్యంలో ప్రత్యేక చిత్రపటాల ద్వారా ఇన్‌స్ట్రక్టర్ లక్ష్మణ్, సహాయకులు సంపత్ విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు తిరుపతిరెడ్డి, పవన్, నాగలక్ష్మి, సీఆర్‌పీ రాజన్న పాల్గొన్నారు.

లైసెన్స్ సేవల సారథి వెబ్‌సైట్ ప్రారంభం

హాజీపూర్, సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి): వేంపల్లి జిల్లా రవాణశాఖ కార్యాలయంలో లైసెన్స్ సేవా సారథి వెబ్‌సైట్‌ను శుక్రవారం నుంచి ప్రారంభించారు. మొదటి లర్నింగ్ లైసెన్స్‌ను వాహనదారుడికి అందజేశారు. ఇకపై ఎవరైన లర్నింగ్ లైసెన్స్ పొందాలంటే సారథి పరివాహన్ వెబ్‌సైట్ నుంచి సేవలు పొందొచ్చని రవాణశాఖ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణశాఖ అధికారి రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌పై నిర్లక్ష్య ధోరణి..

(3వ పేజీ తరువాయి)

ఖరారులో జాప్యం జరుగుతోంది. హైదరాబాద్‌లో ఎస్‌జీఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీతో జిల్లా ఎస్జీఎఫ్ సెక్రెటరీల సమావేశం నిర్వహించి, షెడ్యూల్ ఖరారు చేస్తారు. సమావేశం ఏర్పాటులోనూ తీవ్ర జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఆ సమావేశం జరిగితే తప్ప ఎస్‌జీఎఫ్ ద్వితీయ షెడ్యూల్ క్రీడా పోటీలు ప్రారంభం అయ్యే అవకాశాలు లేవు.

కళాశాల స్థాయి వరకు క్రీడలు...

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కేజీ బీవీలు, గురుకులాలు, జూనియర్ కాలేజీలలో ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు నిర్వహించాల్సి ఉంది. వీటిలో పాఠశాల స్థాయిలో చదువుతున్న విద్యార్థులు అండర్ -14, అండర్ -17 విభాగంలో, ఇంటర్ విద్యార్థులు అండర్ -19 విభాగంలో క్రీడా పోటీల్లో పాల్గొంటారు. బాలబాలికలకు వేర్వేరుగా వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహిస్తారు. వీటితో పాటు అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, చదరంగం, టెన్నిస్, బాస్కెట్‌బాల్, తదితర క్రీడల్లో కూడా పోటీలు జరుగుతాయి.

ఇక్కడ ప్రతిభ చాటిన విద్యార్థులు జాతీయ స్థాయి వరకు రాణించేందుకు అవకాశం ఉంటుంది. విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దే ఎస్‌జీఎఫ్‌పట్ల నిర్లక్ష్య ధోరణిని పలు క్రీడా సంఘాలు తప్పుబడుతున్నాయి.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

దండేపల్లి సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాజీమార్గం రాజామర్గమని దండేపల్లి ఎస్సై ఎండి తహసీనోద్దీన్ అన్నారు. దండేపల్లి పోలీసుస్టేషన్ పరిధిలోని ప్రజలందరికి ముందస్తు సమాచార నిమిత్తం కోసం ఈనెల 13న లక్షెట్టిపేట కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్న లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్సై మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం జరుగుతుందన్నారు. రాజీమార్గం రాజామార్గమని చిన్న చిన్న కేసులతో కక్ష పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని డబ్బులనువృధా చేసుకోవద్దన్నారు.

జూడిషియల్ డిపార్ట్మెంట్ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

వాంకిడి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సైబర్‌నేరాలపై అప్రమ త్తంగా ఉండాలని కళాబృందం సభ్యులు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్‌నేరాలు, మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సైబర్‌నేరాలు, మాదక ద్రవ్యాలు, దష్ప్రబావాలు, బాల్యవివాహాలు, రోడ్డు ప్రమాదాలు, మహిళల భద్రత, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, చట్టం- శాంతి భద్రతలపై విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాల రూపంలో అవగాహన కల్పించారు. మహిళలు, విద్యార్థులు ఏమైన సమస్యలు ఉంటే 1930, 100, 1098 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణ, నైతిక విలువలు, సమాజ సేవా బావన పెంపొందించుకోవాలని ఈ సందర్భంగా ఎస్సై పరుశురామ్ కోరారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు రోహిత్, రాంచందర్, శ్రీనివాస్, చంద్రశేఖర్, రజిత, సంఘవి పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలి

జైనూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులు విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలని వరంగల్ డైరెక్టర్ తిరుపతిరెడ్డి అన్నారు. కాలేజీగూడ సమీపంలో శుక్రవారం ట్రాన్స్‌కో అధికారులు సీఎండీ ఆదేశాల మేరకు విస్తృతంగా తనిఖీలు చేశారు. డైరెక్టర్ మాట్లాడుతు సకా లంలో బిల్లులు చెల్లించి అధికారులకు సహకరించాలని కోరారు. కాలేజీగూడలో ఇంటింటికీ తిరిగి మీటర్లను పరిశీలిం చారు. కార్యక్రమంలో నోడల్ అధికారి కళాధర్ రెడ్డి, ఎస్ఈ శేషరావ్, అకౌంట్ అధికారి తుకారాం, డీఈ రవిందర్, ఏఈ సాయికృష్ణ పాల్గొన్నారు.

సింగరేణిని కాపాడుకోవాలి

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): సింగరేణిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని బీఎంఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడు కారంపూడి శ్రీనివాసరాజు, కేంద్ర కార్యనిర్వహణా కార్యదర్శి ఐలవేణి శ్రీనివాస్ అన్నారు. యూనియన్ ఆధ్వర్యంలో జూలై 23 నుంచి సెప్టెంబర్ 17 వరకు నిర్వహిస్తున్న ఆందోళనల్లో భాగంగా శుక్రవారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, జీఎం ఎం .శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ, సింగరేణిలో అండర్‌గ్రౌండ్ గనులు మూతపడుతున్నాయని, నూతన గనులు వస్తేనే యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన 42.739 వేల కోట్ల రూపాయలు వెంటనే చెల్లించాలని, బొగ్గు ఉత్పత్తిలో 50 శాతం పర్మనెంట్ కార్మికుల ద్వారా వెలికితీయాలన్నారు. లాభాల వాటా 40 శాతం చెల్లించాలని, ప్రతి కార్మికుడికి 250 చదరపు గజాల స్థలం, ఇంటి నిర్మాణానికి 50 లక్షల రూపాయల వడ్డీ లేని రుణం ఇవ్వాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులు వెంటనే భర్తీ చేయాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా కార్యదర్శి రాగం రాజేందర్, మందమర్రి ఏరియా కార్యదర్శి గుర్రం ప్రదీప్ కుమార్, కోశాధికారి గూడ శ్రీకాంత్, నాయకులు శ్రీధర్, సతీష్, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): సింగరేణి పరిశ్రమ పరిరక్షణ, పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘం బీఎంఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కోల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరి రమాకాంత్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న బొగ్గు పరిశ్రమలను, సింగరేణి సమస్యలను పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కేసరి అంజనేయులుగౌడ్, కమలాకర్జీ, రాములు, అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి, శంకర్, యాదవ్, చందు పాల్గొన్నారు.


జీఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సింగరేణి సమాచారం

ఆర్‌కే న్యూటెక్ ఉద్యోగులకు అభినందన

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి) : రక్షణ పక్షోత్సవాల్లో భాగంగా ద్వితీయ బహుమతి, ఫైవ్‌స్టార్ రేటింగ్ సాధించిన సందర్భంగా ఆర్‌కే న్యూటెక్ గని ఆవరణలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్ హాజరై ఉద్యోగులను అభినందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

రెబ్బెన, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గనుల పరిసరాల్లో మొక్కలు నాటి సంరక్షించాలని మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంటు ఫారెస్టు అండ్ క్లయిమెట్ ఛేంజ్ సైంటిస్ట్ తరుణ్‌కుమార్ అన్నారు. సింగరేణి బీపీఏ, ఓసీ 2, ఎక్స్‌టెన్షన్, మూత బడిన గోలేటి-1 తదితర గనులను శుక్రవారం ఆయన పర్యటించారు. కార్యక్రమంలో ఏరియా జీఎం ఎం.విజయభాస్కర్‌రెడ్డి, ఎన్విర్మానెంటు జీఎం సైదులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల అండతో సొంతింటి పథకం సాధిస్తాం



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): కార్మికుల అండతో సొంతింటి పథకం సాధిస్తామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షు డు తుమ్మల రాజారెడ్డి అన్నారు. సొంతిళ్లు కావాలా, నూతన క్వార్టర్ కావాలా అనే అంశంపై ఈ నెల 11, 12 తేదీల్లో గనులు, విభాగాలపై ఓటింగ్ నిర్వహించారు. ఓట్లను నస్పూర్- శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం లెక్కించారు. అనంతరం ఆయన మా ట్లాడుతూ, మొత్తం 4543 మంది సొంతిళ్లు కావాలని, 31 మంది నూతన క్వార్టర్ కావాలని ఓట్ల ద్వారా తమ అభిప్రాయం తెలిపారన్నారు. సమావేశంలో బ్రాంచ్ కార్యదర్శి గుల్ల బాలాజీ, బ్రాంచ్ నాయకులు వెంగళ శ్రీనివాస్, తోడె సుధాకర్, పెరుక సదానందం, శ్రీధర్, సాయిల్ల శ్రీనివాస్, వెంకటేష్, శ్రీనివాస్, డీవైఎఫ్ఐ నాయకుడు మిడివెల్లి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

స్ట్రక్చర్ సమావేశం బహిష్కరించాం

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి) : కార్మిక సమస్యల పరిష్కారంలో గత రెండేళ్లుగా కాలయాపన చేస్తున్న సింగరేణి యాజమాన్యం మొండి వైఖరిని నిరిసిస్తూ స్ట్రక్చర్ సమావేశం బహిష్కరించినట్లు ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కె. రాజ్‌కుమార్ వెల్లడించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సీఎండీ ఎన్ బలరాంతో స్ట్రక్చర్ సమావేశం జరగాల్సి ఉంది. దానిని బహిష్కరించిన అనంతరం సీపీఐ కార్యాలయంలో మాట్లాడారు. గత రెండేళ్ల కాలంలో డైరెక్టర్(పా)తో రెండుసార్లు, సీఎండీతో ఒకసారి స్ట్రక్చర్ సమావేశం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సొంతింటి పథకం అమలు చేయాలని కోరగా, కమిటీ వేసి ఏటూ తేల్చలేదన్నారు. నెలనెలా జరగాల్సిన మెడికల్‌బోర్డును వాయిదా వేస్తూ వస్తున్నారన్నారు. పెర్క్స్‌పై ఆదాయపు పన్ను గురించి ప్రస్తావించగా, సింగరేణిలో లాభాల వాటా ఇస్తున్నందున మినహాయింపు ఇవ్వలేమని తేల్చారన్నారు. నమూరు పేర్ల విషయంలో అడ్వకేట్ జనరల్ నుంచి లీగల్ అభిప్రాయం రావాల్సి ఉందని యాజ మాన్యం వాయిదా వేస్తోందన్నారు. పలు సమ స్యలు ప్రస్తావించినా స్పందన లేక పోవడంతో బహిష్కరించామని తెలిపారు. సమావేశంలో యూనియన్ అదనపు ప్రధాన కార్యదర్శి ఉప ప్రధాన కార్యదర్శులు కె. సారయ్యవీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, మడ్డి ఎల్లయ్య, కేంద్ర కార్యదర్శులు వెంకటి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య



తొలిరోజు మనదే

● సింగిల్స్‌లో దక్షిణేశ్వర్, సుమిత్ గెలుపు

● భారత్ 2-0 ● స్విట్జర్లాండ్‌తో డేవిస్ కప్

బీల్ (స్విట్జర్లాండ్): డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్-1లో భాగంగా ఆతిథ్య స్విట్జర్లాండ్‌తో పోరులో తొలిరోజు భారత్‌దే పైచేయి అయింది. శుక్రవారం జరిగిన సింగిల్స్ రివర్స్ సింగిల్స్ మ్యాచుల్లో భారత ఆటగాళ్లు గెలవడంతో 2-0 ఆధిక్యం లభించింది. అయితే, ప్రధానంగా తొలిసారి డేవిస్ కప్ ఆడుతున్న తమిళనాడుకు చెందిన దక్షిణేశ్వర్ సురేష్ తనకంటే మెరుగైన ర్యాంకరైన ప్రత్యర్థిని ఓడించడం మొదటిరోజు ఆటలో విశేషం. తొలి సింగిల్స్‌లో 626వ ర్యాంకర్ దక్షిణేశ్వర్ 7-6 (5), 6-3తో 155వ ర్యాంకరైన జెరోమ్ కిమ్‌ను చిత్తు చేసి సంచలనం సృష్టించాడు. అనంతరం జరిగిన రివర్స్ సింగిల్స్‌లో అనుభవజ్ఞుడైన సుమిత్ నగల్ 6-3, 7-6(4)తో మార్క్ అండ్రియా హస్లెర్‌పై గెలిచి భారత్‌కు 2-0 ఆధిక్యాన్ని అందించాడు. ఇక, శనివారం జరిగే డబుల్స్ మ్యాచ్‌లో శ్రీరామ్ బాలాజీ/బొల్లిపల్లి రిత్విక్ చౌదరి జోడీ బరిలోకి దిగనుంది.

స్టార్లతో కళకళ

నేటినుంచి వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్

భారత్ ఆశలన్నీ నీరజ్‌పైనే



స్టార్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం



టోక్యో: ఒలింపిక్స్ తర్వాత అథ్లెటిక్స్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైనది ప్రపంచ చాంపియన్‌షిప్స్. విశ్వవ్యాప్త ప్రఖ్యాత అథ్లెట్ల సత్తాకు పరీక్షగా నిలిచే ఈ చాంపియన్‌షిప్స్ శనివారం టోక్యోలో ప్రారంభం కానున్నాయి. ఈనెల 21 వరకు జరిగే పోటీలలో 200 జట్ల నుంచి 2000 మంది అథ్లెట్లు తలపడుతున్నారు. 49 విభాగాలలో మొత్తం 147 పతకాలకోసం హోరాహోరీ పోరు జరగనుంది. షెల్లీ ఆన్ ఫ్రేజర్ ప్రైస్, షకారీ రిచర్డ్‌సన్, నోవా లైల్స్, కిషానే థాంప్సన్, సిడ్నీ మెక్‌లాలిన్, అర్మాండ్ డుప్లాంటిస్, నీరజ్ చోప్రా వంటి మేటి అథ్లెట్లు ఫ్యాన్స్‌ను అలరించనున్నారు.

నేటి భారత షెడ్యూల్
ఉ. 4 గం.: పురుషుల 35 కి.మీ. రేస్ వాక్-రాంబాబు, సందీప్; మహిళల 35 కి.మీ. రేస్‌వాక్-ప్రియాంక గోస్వామి
సా. 4.30: మహిళల 1500 మీ. హీట్-పూజ

షెల్లీ ఘనంగా ముగిస్తుందా..?

ఈసారి వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో జమైకా స్ప్రింట్ దిగ్గజం, మహిళల 100 మీ. స్ప్రింట్ రారాణి షెల్లీ ఆన్ ఫ్రేజర్ ప్రైస్‌పై అందరి దృష్టి నిలిచింది. 38 ఏళ్ల స్టార్ ఈ పోటీల తర్వాత ట్రాక్ నుంచి రిటైర్ కానుంది. మూడు ఒలింపిక్, 10 ప్రపంచ చాంపియన్‌షిప్స్ స్వర్ణ పతకాల విజేత షెల్లీ టైటిల్‌తో ఘనమైన వీడ్కోలు తీసుకోవాలని భావిస్తోంది. అలాగే మహిళల 100, 200 మీ.లలో అమెరికన్ క్వీన్ షకారీ రిచర్డ్‌సన్ ప్రధాన ఆకర్షణ కానుంది. గత వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో నెగ్గిన 100 మీ. టైటిల్‌ను నిలబెట్టుకోవాలని రిచర్డ్‌సన్ పట్టుదలగా ఉంది. గాయాలతో సతమతమవుతున్న పురుషుల 100.మీ., 200 మీ.ల డిఫెండింగ్ చాంపియన్ నోవా లైల్స్ (అమెరికా) టైటిళ్లు నిలబెట్టుకుంటాడేమో చూడాలి. సీజన్‌లో అద్భుత ఫామ్‌లో ఉన్న జమైకా స్ప్రింటర్ కిషానే థామ్సన్..నోవాకు గట్టి పోటీ ఇవ్వనున్నాడు. బరిలో దిగిన ప్రతి టోర్నీలో రికార్డులు నమోదు చేస్తున్న పురుషుల పోల్‌వాల్ట్ మొనగాడు అర్మాండ్ డుప్లాంటిస్ టోక్యోలో నెలకొల్పే రికార్డుపై ఉత్కంఠ ఏర్పడింది. ఇంకా భారత స్టార్ నీరజ్ చోప్రా, మహిళల 400 మీ. హర్డిల్స్‌లో ప్రపంచ రికార్డు గ్రహీత సిడ్నీ మెక్‌లాలిన్ (అమెరికా), మహిళల 1500, 5వేల మీ.లలో కిప్‌యేగాన్ (కెన్యా) మెరుపులు చూసి తీరాల్సిందే.

టైటిల్‌పై నీరజ్ గురి

భారత్ ఆశలన్నీ సూపర్ స్టార్ నీరజ్ చోప్రాపైనే నిలిచాయి. 2023 బుడాపెస్ట్ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో జావెలిన్ పసిడి పతకంతో చరిత్ర సృష్టించిన నీరజ్.. ఆ టైటిల్‌ను నిలబెట్టుకోడమే ధ్యేయంగా బరిలోకి దిగుతున్నాడు. అయితే పాకిస్థాన్‌కు చెందిన ఒలింపిక్ చాంపియన్ అర్షద్ నదీమ్, చెక్ త్రోయర్ జాకబ్ వాల్డేచ్‌ల నుంచి నీరజ్‌కు తీవ్రమైన పోటీ ఎదురుకానుంది. ఇక..మొత్తం 19 మంది అథ్లెట్ల భారత బృందం టోక్యోలో తలపడుతోంది. కానీ పతక ఆశలు మాత్రం నీరజ్‌పైనే నిలిచాయి. ఈనెల 17న జావెలిన్ ఈవెంట్ మొదలు కానుంది. భారత్ నుంచి అన్నూరాణి (మహిళల జావెలిన్), పారుల్ చౌధరి (3000మీ స్టీపుల్ చేజ్), మురళీ శ్రీశంకర్ (లాంగ్ జంప్), గుల్వీర్ సింగ్ (5000మీ.), ప్రవీణ్ చిత్రవేల్ (ట్రిపుల్ జంప్) కూడా బరిలో ఉన్నారు.

ఫైనల్‌కు జైస్మిన్



సెమీస్‌లో మీనాక్షి ● ప్రపంచ బాక్సింగ్

లివర్‌పూల్ (ఇంగ్లండ్): ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో భారత బాక్సర్ జైస్మిన్ లంబోరియా ఫైనల్ చేరింది. మహిళల 57 కిలోల విభాగం సెమీస్‌లో జైస్మిన్ 5-0తో ఒమైలిన్ అల్కాలా (వెనెజులా)ను చిత్తుచేసి కనీసం రజతం ఖాయం చేసుకుంది. మరో అమ్మాయి మీనాక్షి హుడా సెమీస్ చేరడంతో భారత్ ఖాతాలో మరో పతకం ఖరారైంది. 48 కిలోల విభాగం క్వార్టర్‌ఫైనల్లో మీనాక్షి 5-0తో అలైస్ పుంప్రే (ఇంగ్లండ్)ను ఓడించింది. ఇక..పురుషుల విభాగంలో భారత్ పోరు ముగిసింది. బరిలో మిగిలిన జాదుమని సింగ్ 50 కిలోల కేటగిరీ క్వార్టర్‌ఫైనల్లో సాంఘుర్ (కజకిస్థాన్) చేతిలో 0-4తో పరాజయం పాలయ్యాడు.

పాక్ శుభారంభం

ఆసియా కప్‌లో నేడు
బంగ్లాదేశ్ x శ్రీలంక
రాత్రి 8 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..

ఒమన్‌పై ఘనవిజయం



దుబాయ్: భారత్‌తో మ్యాచ్‌కు ముందు పాకిస్థాన్ జట్టు కూడా ఆత్మవిశ్వాసాన్ని పెంచుకుంది. ఆసియా కప్‌లో భాగంగా శుక్రవారం గ్రూప్ 'ఎ'లో ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో 93 పరుగుల తేడాతో నెగ్గింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' మహ్మద్ హరీస్ (43 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 66) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాక్ ఆరంభంలో తడబడినా.. చివరకు 20 ఓవర్లలో 7 వికెట్లకు 160 పరుగులు సాధించింది. ఓపెనర్ సహిబ్జాద ఫర్హాన్ (29), ఫఖర్ జమాన్ (23 నాటౌట్), మహ్మద్ నవాజ్ (19) పర్వాలేదనిపించారు. పేసర్ షా ఫైజల్, స్పిన్నర్ ఆమిర్ కలీమ్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో పాక్ బౌలర్ల ధాటికి ఒమన్ బ్యాటర్లు తేలిపోయారు. దీంతో ఆ జట్టు 16.4 ఓవర్లలో 67 పరుగులే చేసి చిత్తుగా ఓడింది. 10 పరుగుల వ్యవధిలోనే ఏడు వికెట్లు కోల్పోవడం గమనార్హం. హమ్మద్ మీర్జా (27) ఒక్కడే కాస్త పోరాడాడు. స్పిన్నర్లు సుఫియాన్, సయీమ్ అయూబ్‌లతో పాటు పేసర్ ఫహీమ్‌లకు రెండేసి వికెట్లు లభించాయి.

సంక్షిప్త స్కోర్లు

పాకిస్థాన్: 20 ఓవర్లలో 160/7 (మహ్మద్ హరీస్ 66, ఫర్హాన్ 29, ఫఖర్ 23; కలీమ్ 3/31, ఫైజల్ 3/34).
ఒమన్: 16.4 ఓవర్లలో 67 ఆలౌట్. (హమ్మద్ 27; ఫహీమ్ 2/6, సుఫియాన్ 2/7, సయీమ్ అయూబ్ 2/8).

సెమీస్‌లో సాత్విక్ జోడీ

● లక్ష్యసేన్ కూడా..
● హాంకాంగ్ ఓపెన్



హాంకాంగ్: భారత షట్లర్లు లక్ష్యసేన్, సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి హాంకాంగ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో టైటిల్ దిశగా దూసుకెళ్తున్నారు. సింగిల్స్‌లో లక్ష్యసేన్, డబుల్స్‌లో సాత్విక్ ద్వయం సెమీఫైనల్లో ప్రవేశించారు. ఇద్దరు భారత ఆటగాళ్ల మధ్య జరిగిన సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో లక్ష్య 21-16, 17-21, 21-13తో ఆయుష్ షెట్టిపై గెలుపొందాడు. గత మ్యాచ్‌లో 2024 ప్రపంచ చాంపియన్‌షిప్ రన్నరప్ కొడాయి నరౌకాకి షాకిచ్చి సంచలనం సృష్టించిన ఆయుష్.. లక్ష్యతో పోరులో మాత్రం తడబడ్డాడు. అయితే ఓడినా.. ఆయుష్ గెలుపు కోసం చివరిదాకా పోరాడిన తీరు ఆకట్టుకుంది. గంటా ఆరు నిమిషాల పాటు సాగిన హోరాహోరీ పోరులో తొలి గేమ్ ఓడినా, రెండో గేమ్‌లో లక్ష్యపై పైచేయి సాధించి మ్యాచ్ గెలిచేలా కనిపించాడు. కానీ, నిర్ణాయక మూడో గేమ్ ఆఖర్లో పలుమార్లు ఔట్ షాట్‌లు కొట్టి మ్యాచ్‌ను చేజార్చుకున్నాడు. ఫైనల్ బెర్త్ కోసం తైవాన్ షట్లర్, మూడో సీడ్ చో తిన్ చెన్‌తో లక్ష్య అమీతుమీ తేల్చుకోనున్నాడు. పురుషుల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్స్‌లో 8వ సీడ్ సాత్విక్/చిరాగ్ జంట 21-14, 20-22, 21-16తో మలేసియా జోడీ ఆరిఫ్ జునైది/రాయ్ కింగ్ యాప్‌ను ఓడించింది. ఇటీవలే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకంతో సత్తా చాటిన సాత్విక్ ద్వయం సెమీఫైనల్లో తైవాన్ జోడీ చెన్ చెంగ్ కాన్/లిన్ బింగ్ వీతో తలపడనుంది.

గాథ పోరు ముగిసె..

● నెంబర్‌వన్ చేతిలో ఓటమి
● ఆర్చరీ ప్రపంచ చాంపియన్‌షిప్స్

గ్వాంగ్జు (దక్షిణ కొరియా): ఆర్చరీ ప్రపంచ చాంపియన్‌షిప్స్ రికర్వ్ విభాగంలో భారత్‌కు ఈసారీ నిరాశ తప్పలేదు. మహిళల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో ప్రీక్వార్టర్స్ చేరి టైటిల్‌పై ఆశలు రేపిన 15 ఏళ్ల గాథ ఖడాకే పోరాటం ముగిసింది. ప్రపంచ నెంబర్‌వన్, పారిస్ ఒలింపిక్స్‌లో మూడు స్వర్ణాల విజేత లిమ్ షియోన్ (కొరియా)తో జరిగిన పోరులో గాథ 0-6తో ఓటమిపాలైంది. ప్రపంచ చాంపియన్‌షిప్స్ రికర్వ్ విభాగంలో భారత్ చివరిసారిగా 2019లో పురుషుల జట్టు రజతం నెగ్గింది. కాగా, ఈసారి టోర్నీలో కాంపౌండ్ ఈవెంట్‌లో పురుషుల జట్టు స్వర్ణం, మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో జ్యోతి సురేఖ/రిషభ్ జోడీ రజతం నెగ్గిన సంగతి తెలిసిందే.

యష్, రజత్ శతకాలు

● సెంట్రల్ జోన్ 384/5 ● 'సౌత్'తో దులీప్ ట్రోఫీ ఫైనల్

బెంగళూరు: దులీప్ ట్రోఫీ ఫైనల్లో సెంట్రల్ జోన్ రెండో రోజే పట్టు బిగించింది. యష్ రాథోడ్ (137 బ్యాటింగ్), కెప్టెన్ రజత్ పటీదార్ (101) శతకాల సహాయంతో.. శుక్రవారం ఆట ముగిసే సమయానికి సెంట్రల్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 384/5 స్కోరు సాధించింది. ప్రస్తుతం జట్టు 235 పరుగుల భారీ ఆధిక్యంలో నిలిచింది. ఓపెనర్ మలేవర్ (53) హాఫ్ సెంచరీ చేయగా, క్రీజులో యష్‌తో పాటు సారాంశ్ (47 బ్యాటింగ్) ఉన్నాడు. లెఫ్టామ్ పేసర్ గుర్జపనీత్‌కు మూడు వికెట్లు దక్కాయి. సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 149 పరుగులకు కుప్పకూలిన విషయం తెలిసిందే.

బెంగళూరు హ్యాట్రిక్

జైపూర్: ప్రొ. కబడ్డీ లీగ్‌లో బెంగళూరు బుల్స్ జోరు ప్రదర్శిస్తూ వరుసగా మూడో విజయం సాధించింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో 28-23తో జైపూర్ పింక్ పాంథర్స్‌ను ఓడించింది. దీపక్ శంకర్ మరో 'హై ఫైవ్'తో అదరగొట్టగా, రైడర్ అలీరెజా 8 పాయింట్లతో సత్తా చాటాడు. జైపూర్‌లో నితిన్ కుమార్ (8) ఒక్కడే రాణించాడు. మరో మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ 46-36తో బెంగాల్ వారియర్స్‌ను చిత్తు చేసింది.

ఇక దయచేయండి!



విరుష్కతో కివీస్ హోటల్ సిబ్బంది

న్యూఢిల్లీ: విరాట్ కోహ్లీ, అనుష్క జోడీని వెళ్లిపోవాలని న్యూజిలాండ్‌లోని ఓ హోటల్ సిబ్బంది కోరిన ఉదంతాన్ని టీమిండియా బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ వెల్లడించింది. గతంలో భారత పురుషులు, మహిళల జట్లు ఒకే సమయంలో కివీస్‌లో పర్యటించాయి. ఇరు జట్లూ ఒకే హోటల్‌లో బస చేశాయి. ఈక్రమంలో బ్యాటింగ్‌కు సంబంధించి సలహాలు ఇవ్వాలని స్మృతి మంధాన, జెమీమా..విరాట్‌ను కోరారు. దాంతో అదే హోటల్‌లోని కేఫ్‌కు రావాలని విరాట్ వారికి సూచించాడు. అప్పటికే కోహ్లీ, అనుష్క జోడీ అక్కడ ఉంది. దాదాపు నాలుగు గంటలపాటు విరాట్, మంధాన, జెమీమాతోపాటు అనుష్క మాట్లాడుకున్నారట. తొలి అరగంట క్రికెట్ విషయాలపై చర్చించగా.. ఆపై సాధారణ జీవితానికి సంబంధించిన మాటల్లోకి జారుకున్నట్టు జెమీమా వెల్లడించింది. అప్పటికే రాత్రి 11.30 కావడంతో కేఫ్ సిబ్బంది వచ్చి విరాట్, అనుష్కను అక్కడ నుంచి వెళ్లిపోవాలని సూచించినట్టు రోడ్రిగ్స్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది.

ఐపీఓ మార్కెట్లో సంస్కరణలు

● కనీస పబ్లిక్ షేర్ హోల్డింగ్‌పై కంపెనీలకు ఊరట
● 10 ఏళ్ల వరకు గడువు పెంపు
● సెబీ చైర్మన్ పాండే



ముంబై : దేశ క్యాపిటల్ మార్కెట్లో మరిన్ని సంస్కరణలకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ శ్రీకారం చుట్టింది. శుక్రవారం చైర్మన్ తుహిన్ కాంత పాండే అధ్యక్షతన జరిగిన బోర్డు సమావేశంలో సెబీ దీనికి సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా పెద్దమొత్తంలో మార్కెట్ క్యాపిటలైజేషన్ ఉన్న కంపెనీలకు పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)ల జారీలో మరింత వెసులుబాటు కల్పించాలని సెబీ నిర్ణయించింది. రూ.50,000 కోట్ల నుంచి రూ.లక్ష కోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ ఉన్న కంపెనీలు తమ ఈక్విటీలో 25 శాతం కనీస పబ్లిక్ షేర్‌హోల్డింగ్ (ఎంపీఎస్) కలిగి ఉండాలన్న గడువును ప్రస్తుత మూడేళ్ల నుంచి ఐదేళ్లకు పొడిగించారు. కంపెనీలు ఈ మొత్తాన్ని ఒకేసారి కాకుండా ముందు కనీసం 8 శాతం ఈక్విటీ షేర్లను జారీ చేసి, ఆ తర్వాత మిగతా 17 శాతం ఈక్విటీ షేర్లను దశలవారీగా ఐపీఓల ద్వారా విక్రయించేందుకు అనుమతిస్తారు. రూ.లక్ష కోట్ల నుంచి రూ.5 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్ ఉన్న కంపెనీలు ఐదేళ్లలో జారీ చేయాల్సిన ఎంపీఎస్ ఈక్విటీ షేర్ల పరిమితినీ సెబీ సవరించింది. ప్రస్తుతం ఈ కంపెనీలు ఇందుకోసం ముందుగా 5 శాతం ఈక్విటీని ఎంపీఎస్‌గా జారీ చేయాలి. దీన్ని 2.75 శాతానికి కుదించాలని సెబీ నిర్ణయించింది. ఇక రూ.5 లక్షల కోట్ల కంటే ఎక్కువ మార్కెట్ క్యాప్ ఉన్న కంపెనీలు 25 శాతం ఎంపీఎస్‌కి చేరాల్సిన గడువునీ ప్రస్తుత ఐదేళ్ల నుంచి పదేళ్లకు పెంచారు. ఇందుకోసం ఈ కంపెనీలు ముందు తమ ఈక్విటీలో 2.5 శాతం షేర్లను ఐపీఓ ద్వారా జారీ చేస్తే సరిపోతుంది. మిగతా 22.5 శాతం ఈక్విటీ షేర్లను మార్కెట్ పరిస్థితులను బట్టి పదేళ్లలో జారీ చేస్తే సరిపోతుంది.

పెద్ద కంపెనీలకు ఊరట: సెబీ తాజా నిర్ణయం త్వరలో పబ్లిక్ ఇష్యూకి వచ్చే రిలయన్స్ జియో, ఎన్ఎస్ఈలకు మేలు చేస్తుందని భావిస్తున్నారు. సెబీ నిబంధనలకు అనుగుణంగా ఒకేసారి పెద్ద మొత్తంలో ఐపీఓలు జారీ చేస్తే.. ఆ ఇష్యూలను భరించే శక్తి మార్కెట్‌కు లేకపోవడంతో పాటు సెకండరీ మార్కెట్ కూడా తీవ్ర ఆటుపోట్లకు లోనవుతోంది. నిర్దేశిత గడువులోనే దశల వారీగా ఈ వాటా విక్రయించేందుకు అనుమతించాలని కంపెనీలు ఎప్పటి నుంచో కోరుతున్నాయి. సెబీ ఎట్టకేలకు శుక్రవారం దీనికి ఆమోదం తెలిపింది.

రిటైల్ మదుపరులకు ఊరట: ప్రస్తుతం రూ.5,000 కోట్లకు మించిన ఐపీఓ ఇష్యూల్లో రూ.2 లక్షల లోపు పెట్టుబడితో దరఖాస్తు చేసే రిటైల్ మదుపరులకు 35 శాతం షేర్లు కేటాయిస్తున్నారు. దీన్ని 25 శాతానికి కుదించాలని సంస్థాగత మదుపరుల నుంచి ఒత్తిడి వచ్చింది. అయినా ఈ వాటాను యథాతథంగా 35 శాతం వద్దే కొనసాగించాలని నిర్ణయించినట్టు సెబీ చైర్మన్ పాండే చెప్పారు. క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ బయ్యర్స్ (క్యూఐబీ)కు కేటాయించే 50 శాతం వాటానూ అలాగే కొనసాగించాలని సెబీ నిర్ణయించింది.

ఎఫ్‌పీఐల పెట్టుబడులకు సింగిల్ విండో: భారత స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టే విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ)కు సింగిల్ విండో విధానాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. దీని ద్వారా తక్కువ రిస్క్ కలిగిన ఎఫ్‌పీఐల పెట్టుబడులను ఆకర్షించవచ్చని భావిస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా సింగిల్ విండో ఆటోమేటిక్ అండ్ జనరలైజ్డ్ యాక్సెస్ ఫర్ ట్రస్టెడ్ ఫారిన్ ఇన్వెస్టర్స్ (స్వాగత్-ఎఫ్ఐ) పేరుతో కొత్త ముసాయిదాను రూపొందించింది. కాగా దేశంలో ప్రతి నెలా 100 ఎఫ్‌పీఐలు నమోదవుతూ వస్తున్నాయని సెబీ తెలిపింది. ఏడాది క్రితం 10,500 ఎఫ్‌పీఐలు నమోదై ఉండగా ప్రస్తుతం ఈ సంఖ్య 12,000 దాటిందని పేర్కొంది.

ఇతర ప్రధాన నిర్ణయాలు

- రూ.250 కోట్లకు మించిన ఐపీఓల్లో యాంకర్ ఇన్వెస్టర్ల వాటా 10% నుంచి 15 శాతానికి పెంపు
- రూ.250 కోట్ల కంటే తక్కువ ఉండే ఐపీఓల్లో మదుపు చేసే యాంకర్ ఇన్వెస్టర్ల సంఖ్య 5 నుంచి 15 మధ్య ఉండాలి
- నియమిత మదుపరులకు సేవలు అందించే ఏఐఎఫ్‌లకు ఊరట
- రీట్స్, ఇన్విట్స్.. ఈక్విటీ పెట్టుబడులుగా వర్గీకరణ
- ప్రతి స్టాక్ ఎక్స్ఛేంజీలో ఇద్దరు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల నియామకం

అపోలో హాస్పిటల్స్ చేతికి అపోలో హెల్త్

● ఐఎఫ్‌సీ నుంచి 31 శాతం వాటా కొనుగోలు
● డీల్ విలువ రూ.1,254 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అపోలో హెల్త్ అండ్ లైఫ్‌స్టైల్ లిమిటెడ్ (ఏహెచ్ఎల్ఎల్) పూర్తి స్థాయిలో అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏహెచ్ఈఎల్) అనుబంధ సంస్థ కానుంది. ఇందుకోసం ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ) చేతిలో ఉన్న 31 శాతం వాటాను ఏహెచ్ఈఎల్ రూ.1,254.07 కోట్లకు కొనుగోలు చేయనుంది. శుక్రవారం జరిగిన సమావేశంలో ఏహెచ్ఈఎల్ డైరెక్టర్ల బోర్డు ఈ షేర్ల కొనుగోలు ఒప్పందానికి ఆమోదం తెలిపింది. దీంతో ఏహెచ్ఎల్ఎల్ ఈక్విటీలో ఏహెచ్ఈఎల్ వాటా 99.42 శాతానికి చేరుతుంది. మిగతా 0.58 శాతం షేర్లు ఈ-సాప్స్ కింద ఉద్యోగుల వద్ద ఉంటాయి. ఏహెచ్ఎల్ఎల్ కార్యకాపాలపై పూర్తి నియంత్రణ, యాజమాన్యం కోసం ఐఎఫ్‌సీ నుంచి ఈ వాటాలను కొనుగోలు చేస్తున్నట్టు ఏహెచ్ఈఎల్ రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. దీనివల్ల ఏహెచ్ఎల్ఎల్ నిర్వహణ సామర్థ్యం మరింత మెరుగుపడడంతో పాటు, ఆ సంస్థ వ్యాధి నిర్ధారణ సేవలను ఏహెచ్ఈఎల్‌తో పూర్తి స్థాయిలో అనుసంధానించేందుకు వీలవుతుందని పేర్కొంది. ఈ చర్య అపోలో గ్రూప్ సమగ్ర ఆరోగ్య సేవలకు మరింత విలువ జోడిస్తుందని అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ ఎండీ సునీతా రెడ్డి తెలిపారు. ఏహెచ్ఎల్ఎల్‌పై పూర్తి పట్టు ద్వారా ఆ కంపెనీకి చెందిన ప్రాథమిక ఆరోగ్య, వ్యాధి నిర్ధారణ సేవలు, మహిళల ఆరోగ్యం, డెంటల్, డయాలసిస్, అంబులెన్స్ సేవలను మరింత ముందుకు తీసుకు వెళతామని ఏహెచ్ఈఎల్ జాయింట్ ఎండీ సంగీతా రెడ్డి తెలిపారు.

గురుగ్రామ్‌లో క్యాన్సర్ కేర్ సెంటర్: గురుగ్రామ్‌లో రూ.573 కోట్ల పెట్టుబడితో అదనంగా సమగ్ర క్యాన్సర్ కేర్ సెంటర్ ఏర్పాటు చేసేందుకూ ఏహెచ్ఈఎల్ బోర్డు ఆమోదం తెలిపింది. ఈ కేంద్రం ద్వారా ఏటా అదనంగా 350 రోగులకు వైద్య సేవలు అందించవచ్చు. 2029 మార్చి నాటికి ఈ కేంద్రం ఏర్పాటు పూర్తవుతుంది.

మళ్లీ ధరలు సుర్..

ఆగస్టు ద్రవ్యోల్బణం 2.07%

న్యూఢిల్లీ: ద్రవ్యోల్బణం మరోసారి ఊర్ధ్వముఖ చలనం ప్రారంభించింది. కూరగాయలు, మాంసం, చేపలు, గుడ్ల ధరలు పెరగడంతో ఆగస్టు నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 2.07 శాతానికి చేరింది. ద్రవ్యోల్బణం జూలైలో 1.61%, గత ఏడాది ఆగస్టులో (-) 0.69% ఉంది. 9 నెలల పాటు వరుసగా తగ్గుతూ వచ్చిన వినియోగదారుల ధరల సూచీ ఆగస్టులో తొలిసారి ఎగువకు కదిలింది. అయితే ఆర్‌బీఐకి ప్రభుత్వం నిర్దేశించిన కట్టడి పరిధి 4% (2 శాతం ఎగువకు లేదా దిగువకు సద్దుబాటుతో)లోపే ఉంది. ఆగస్టు నెలలో ద్రవ్యోల్బణం గ్రామీణ ప్రాంతాల్లో 1.18% నుంచి 1.69 శాతానికి, పట్టణ ప్రాంతాల్లో 2.1% నుంచి 2.47 శాతానికి పెరిగింది. రాష్ట్రాల వారీగా చూస్తే కేరళలో గరిష్ఠంగా9.04% ఉండగా అసోమ్‌లో కనిష్ఠంగా -0.66% ఉంది. ఆహార, ఇంధన విభాగాలు మినహా ఇతర విభాగాల్లో ద్రవ్యోల్బణం 4.3 శాతంగా ఉంది.

మార్కెట్లలో కొనసాగిన ర్యాలీ


ఇటు ఈక్విటీలు, అటు బులియన్ పరుగులు

ముంబై: అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న ఆశలతో పాటు ఇన్ఫోసిస్ ప్రకటించిన భారీ బైబ్యాక్ ఉత్తేజంతో శుక్రవారం కూడా ఈక్విటీ మార్కెట్లో ర్యాలీ కొనసాగింది. వరుసగా సెన్సెక్స్ ఐదో రోజు, నిఫ్టీ ఎనిమిదో రోజు లాభాల్లో ముగిశాయి. ఇంట్రాడేలో 444.12 పాయింట్లు లాభంతో 81,992.85 పాయింట్లను తాకిన సెన్సెక్స్ చివరికి 355.97 పాయింట్ల లాభంతో 81,904.70 వద్ద ముగిసింది. నిఫ్టీ 108.50 పాయింట్ల లాభంతో 25,114 వద్ద ముగిసింది. వారం మొత్తంలో సెన్సెక్స్ 1193.94 పాయింట్లు, నిఫ్టీ 373 పాయింట్లు లాభపడ్డాయి. వరుసగా 8 సెషన్లలో నిఫ్టీ 534 పాయింట్లు లాభపడింది.

బంగారం, వెండి భగభగ


బులియన్ మార్కెట్లో బంగారం, వెండి ధరల ర్యాలీ కూడా అప్రతిహతంగా కొనసాగుతోంది. ఢిల్లీ మార్కెట్లో 99.9% స్వచ్ఛత గల 10 గ్రాముల బంగారం ధర రూ.700 పెరిగి మరో జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.1,13,800 వద్ద ముగిసింది. 99.5% స్వచ్ఛత గల బంగారం ధర సైతం రూ.700 పెరిగి రూ.1,13,300 వద్ద స్థిరపడింది. రెండు రోజుల నష్టాలకు తెర దించిన వెండి ధర బలమైన పునరుజ్జీవం సాధించింది. కిలో వెండి రూ.4,000 పెరిగి జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.1,32,000 వద్ద స్థిరపడింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)




13వ తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	550
వరంగల్	537	గోదావరి	545
చిత్తూరు	563	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	121	విజయవాడ	140
వరంగల్	121	గుంటూరు	132
కరీంనగర్	121	ఒంగోలు	132
మహబూబ్‌నగర్	121	చిత్తూరు	118
కర్నూలు	121	నెల్లూరు	123
విశాఖపట్నం	144	అనంతపురం	123
గోదావరి	140		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,11,280 ▲	1,02,000 ▲	1,41,000 ▲
విజయవాడ	1,13,150 ▲	1,07,000 ▲	1,31,800 ▲
విశాఖపట్నం	1,13,040 ▲	1,00,540 ▼	1,42,000 ▲
రాజమండ్రి	1,11,270 ▲	1,02,000 ▲	1,28,300 ▲
ప్రొద్దుటూరు	1,13,200 ▼	1,04,140 ▼	1,31,600 ▲
ముంబై	1,09,707 ▲	1,00,492 ▲	1,28,008 ▲

● ఐటీసీ ఆశీర్వాద్ మసాలా..నేచురల్ స్టార్ నానితో 'దమ్ము మీదే.. స్టార్ మీరే' ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఆంధ్ర, తెలంగాణ వాసుల అభిరుచులకు అనుగుణంగా దమ్దార్ ఫుడ్, సినిమా పేరుతో ఈ క్యాంపెయిన్‌ను మహిళల కోసం ప్రత్యేకంగా రూపొందించింది. ఇందులో భాగంగా వంటల పోటీలో గెలిచిన మహిళలతో నాని సినిమా థియేటర్ ప్రకటనలో కనిపించనున్నారు.

● హెల్త్‌కేర్ టెక్నాలజీ సంస్థ ఫుజిఫిల్మ్ ఇండియా.. నిజామాబాద్‌లో తన అడ్వాన్స్‌డ్ ఏఎంయుఎల్ఈటీ ఇన్నోవాలిటీ ఫుల్ ఫీల్డ్ డిజిటల్ మమ్మోగ్రఫీ (ఎఫ్ఎఫ్‌డీఎం) సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. విశ్వమ్ డయాగ్నోస్టిక్స్ సెంటర్‌లో ఈ సిస్టమ్‌ను ఏర్పాటు చేసింది. బ్రెస్ట్ క్యాన్సర్ డయాగ్నోసిస్‌లో ఈ మమ్మోగ్రఫీ కీలకంగా ఉండనుంది.

● టాటా ఈవీ.. మార్కెట్లోకి సరికొత్త నెక్సాన్ ఈవీ విడుదల చేసింది. ఏడీఎస్ సేఫ్టీ టెక్‌తో దీన్ని తీసుకువచ్చింది. దీంతో పాటు కొన్ని కొత్త ఫీచర్లను పొందుపరిచింది. ఎంపవర్డ్ ప్లస్ ఏ45, ఏ45 డార్క్, ఏ 45 రెడ్ డార్క్ వేరియంట్లలో అందుబాటులో ఉండనున్న ఈ నెక్సాన్ ఈవీ ధరలు వరుసగా రూ.17.29 లక్షలు, రూ.17.49 లక్షలు, రూ.17.49 లక్షలు (ఎక్స్‌షోరూమ్)గా ఉన్నాయి.

హైదరాబాద్ మార్కెట్లోకి విన్‌ఫాస్ట్

వీఎఫ్6, వీఎఫ్7 ఎలక్ట్రిక్ కార్లు విడుదల



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వియత్నాం కేంద్రంగా ఉన్న విన్‌గ్రూప్ జేఎస్‌సీ ఎలక్ట్రిక్ వాహన సంస్థ విన్‌ఫాస్ట్ ఇండియా.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లలోకి అడుగు పెట్టింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో తొలి షోరూమ్‌ను ప్రారంభించింది. శుక్రవారం నాడిక్కడ కంపెనీ డిప్యూటీ సీఈఓ అరుణోదయ్ దాస్.. గచ్చిబౌలి, బేగంపేటల్లో నానేష్ ఆటోమోటివ్స్ ఏర్పాటు చేసిన షోరూమ్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మార్కెట్లోకి విన్‌ఫాస్ట్ ప్రీమియం ఎలక్ట్రిక్ కార్లు వీఎఫ్6, వీఎఫ్7 విడుదల చేశారు. వినియోగదారుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని 10 ఏళ్ల బ్యాటరీ వారంటీతో ఈ కార్లను తీసుకు వచ్చినట్లు ఆయన చెప్పారు. కాగా, వీఎఫ్6 ప్రారంభ ధర రూ.16.49 లక్షలు, వీఎఫ్7 ప్రారంభ ధర రూ.20.89 (ఎక్స్‌షోరూమ్)గా నిర్ణయించినట్లు దాస్ తెలిపారు. ఈ ఏడాది చివరి నాటికి దేశవ్యాప్తంగా 27కి పైగా నగరాల్లో 35 డీలర్‌షిప్స్, 26 వర్క్‌షాప్స్‌ను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా హైదరాబాద్ మార్కెట్లో ఇప్పటికే 150కి పైగా కార్లకు బుకింగ్స్ వచ్చాయని, ఈ నెల 22 నుంచి వీటి డెలివరీలను ప్రారంభించనున్నట్లు నానేష్ ఆటో డైరెక్టర్ అక్షయ్ జైన్ తెలిపారు.



పొదుపు మహిళలకు చీరలు

- 'అక్కాచెల్లెళ్లకు మీ రేవంతన్న కానుక'
- బతుకమ్మ పండుగకు ఒక్కొక్కరికి రెండు అందజేయాలని నిర్ణయం
- జిల్లాలో 1,02,992 మంది సభ్యులు





కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా పొదుపు సంఘాల సభ్యులకు బతుకమ్మ పండుగ సందర్భంగా ఇంది రమ్మ చీరలను ఉచితంగా అందించాలని నిర్ణయిం చింది. గతంలో బతుకమ్మ చీరల పేరుతో అం దించిన ఈ పథకాన్ని ఈసారి ఇందిరమ్మ చీరల పేరుతో అమలు చేస్తున్నారు. పొదుపు సంఘాల లోని సభ్యులకు రెండు చీరలను అందజేస్తారు.

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఈ బతుకమ్మ పండుగకు 'అక్కాచెల్లెళ్లకు మీ రేవంతన్న కానుక' పేరిట చీరలను అందించనుంది. ఇప్పటికే స్వయం సహాయక సంఘాల్లో సభ్యుల వివరాలను అధికారులు సేకరించారు. వారం రోజు ల్లోగా జిల్లాకు చీరలు రానున్నాయి. ఒక్కొక్కరికి రెండు చీరల చొప్పున అందజేయను న్నారు.

గతంలో డీలర్ల ద్వారా..

గత ప్రభుత్వం రేషన్‌కార్డులో పేరున్న ప్రతి మహిళకు డీలర్ల ద్వారా బతుకమ్మ చీరలను పంపిణీ చేసింది. ఈ పథకంలో అందించిన చీరలు నాణ్యతగా లేవని మహిళలు వీటిని దరించడం లేదని బావించి కాంగ్రెస్ ప్రభుత్వం గత బతుకమ్మ పండుగకు చీరల పంపిణీని నిలిపి వేసింది. దీంతో కొంత వ్యతిరేకత వస్తుందని బావించి తిరిగి ఈ పథకాన్ని కొనసాగించాలని నిర్ణయించింది. ఇందులో బాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు చీరలు అందించడం ద్వారా చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రధాన ఉద్దేశంతో ఈ పంపిణీ ప్రక్రియను ప్రారంబిస్తున్నారు. ఒక్కొక్కరికి రెండు చీరల చొప్పున ఇవ్వాలని నిర్ణయించారు. మొదటి విడత ఒక్కో చీర మాత్రమే ఇవ్వనున్నారు. దీని కోసం మొదటి విడత వారం రోజుల్లో 1,02,992 చీరలు రానున్నాయి. వీటిని భద్రపరిచే బాధ్యతలను గ్రామీణాభివృద్ధి సంస్థకు అప్పగించారు. వీటిని ఉంచడానికి జిల్లాలోని కౌటాల, రాంపూర్, జైనూరు మండలాల్లో గోదాంలను ఎంపిక చేశారు. ఇక్కడి నుంచి ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామస్థాయికి తరలించను న్నారు.

8,897 స్వయం సహాయక సంఘాలు..

జిల్లాలో 8,897 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఇందులో 1,02,992 మంది సభ్యులు న్నారు. ఈ స్వయం సహాయక సంఘాల్లో 18 ఏళ్లు నిండిన వారికే అవకాశం ఉంది. వీరంత ప్రభుత్వం అందించే రుణాలను పొంది ప్రతినెలా క్రమం తప్పకుండా చెల్లిస్తు ఉంటారు. ప్రస్తుం ప్రభుత్వం అందించనున్న చీరలు చేనేతవి కావడమే కాకుండా చాలా మన్నికగా ఉండనున్నట్లు చెబుతున్నారు. ఒక్కొక్క చీర సుమారు రూ. 800కు లభ్యమయ్యే వాటిని మహిళలకు పంపిణీ చేయాలని భావిస్తు న్నారు.

ఉన్నతాధికారులకు నివేదిక..

కాగజ్‌నగర్ టౌన్: జిల్లాలో సంఘాలు వాటిలో సభ్యుల సంఖ్య ఎంత.. ఏయే ప్రాంతాలకు సరఫరా చేయాలనే వివరాలను ఉన్నతాధికారులకు జిల్లాలోని మెప్మా, సెర్ప్ సిబ్బంది సేకరించి నివేదికలు అందజేశాయి. కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో 900 గ్రూపులుండగా ఒక్కో గ్రూపులో 10 మంది చొప్పున మొత్తం 9,000 మందికి, ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో 270 గ్రూపులకు గానూ 2,700 మంది సభ్యులకు చీరలు పంపిణీ చేయనున్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ . గత ప్రభుత్వం దసరాకు, బతుకమ్మ చీరలను పంపిణీ చేసింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం దసరాకు ముందే బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభమయ్యే నాటికి పొదుపు మహిళలకు చీరలు అందించాలని నిర్ణయించింది. గ్రామీణ ప్రాంతాల్లో ఐకేపీ, మున్సిపాలిటీల్లో మెప్మా సిబ్బందికి బాధ్యతలు అప్పగించనున్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు పంపిణీ..

- దత్తారావు, డీఆర్‌డీవో



దసరా నాటికి స్వయం సహాయక సంఘాల మహిళలకు చీరలను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వారం రోజుల్లోగా జిల్లాకు చీరలు రానున్నాయి. వీటిని భద్ర పరిచేందుకు జిల్లాలో మూడు ప్రాంతాలలో గోదాంలను గుర్తించాం. ప్ర భుత్వ ఆదేశాల మేరకు చీరలను పంపిణీ చేస్తాం.

రెండు రోజుల్లో యూరియా సరఫరా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సిర్పూరు నియోజకవర్గానికి రెండు రోజుల్లో వెయ్యి మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అవుతుందని ఎమ్మెల్యే హరీష్ బాబు తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో క్రిబ్‌కో యూరియా రైలు వచ్చిందని, రైలు నుంచి ఆన్‌లోడ్ అవుతున్నదని అన్నారు.. మంచిర్యాల రైలు నుంచి 300 మెట్రిక్ టన్నులు, ఆదిలాబాద్ రైలు ద్వారా 700 మెట్రిక్ టన్నులు సిర్పూరు నియోజకవర్గానికి కేటాయించిట్లు తెలిపారు. వివిధ వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా అగ్రికల్చర్ ఆఫీసర్ల పర్యవేక్షణలో రైతులకు యూరియా సరఫరా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో చప్పిడి సంజీవ్, బావాజీ, బండు, రవితేజగౌడ్, హరీష్‌గౌడ్ పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్



మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ

వాంకిడి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణ కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సీఐ సత్యనారాయణ అన్నారు. మండలం లోని బంబార గ్రామంలో శుక్రవారం ఉదయం పోలీస్ కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 32 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గంజాయి, గుడుంబా, రేషన్ బియ్యం, వంటి అక్రమ రవాణా దృష్టికి వస్తే వెంటనే 100కు డయల్ చేయాలని చెప్పారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో వాంకిడి, కెరమెరి ఎస్సైలు మహేందర్, మధుకర్, సిబ్బంది పాల్గొన్నారు.

భోజనంలో మెనూ పాటించాలి

లింగాపూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అందజేసే భోజనంలో మెనూ తప్పనిసరిగా పాటించాలని డిప్యూటీ తహసీల్దార్ పేదిరాయుడు, ఆర్‌ఐ ప్రదీప్ అన్నారు. మండలంలోని కంచన్‌పల్లి ఆశ్రమ పాఠశాల, వసతిగృహాన్ని శుక్రవారం సందర్శించారు కార్యక్రమంలో ప్రధానోపా. ధ్యాయుడు శంకర్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జన్కాపూర్‌లోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులలో భాగం గా శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు ఆసిఫాబాద్ పట్టణం, మున్సిపల్ ఏరియాలో విద్యుత్ సరఫ రాలో అంతరాయం ఉంటుందని ఏఈ లక్ష్మిరాజం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

బాల్య వివాహాలు చేయొద్దు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు బాల్య వివాహనాలు చేయొద్దని, దీని వల్ల ఆడపిల్లలకు ఆరోగ్యం సమస్యలు తలెత్తుతాయని ఎన్జీవో ప్రతినిధులు అన్నారు. కాగజ్‌నగర్ ఈసుగాం ఆలయంలో శుక్రవారం బాల్య వివాహవిముక్తి కార్యక్రమాన్ని షూర్ ఎన్జీవో ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు సంతోష్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసచారి, ఎన్జీఓస్ ప్రతినిధులు జిల్లా సమన్వకర్త బండి సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కుమరంభీం ఆసిఫాబాద్ జిలాల్ల షూటింగ్ బాల్ ఆసోసియోషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని క్రీడా పాఠశాల అవరణలో జూనియర్ బాలబాలికల జిల్లా జట్టు ఎంపిక పోటీలను జిల్లా యువజన క్రీడాల అధికారి రమాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంబించారు. జిల్లా నుంచి 120 మంది క్రీడాకారులు ఈ ఎంపిక పోటీల్లో హజరు కాగా మంచి క్రీడా నైపుణ్యం కనబరిచిన 24 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడా జట్లు ఈనెల 22 నుంచి 24 వరకు మహబూబబాద్ జిల్లాలో జరగనున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలబాలికల షూటింగ్‌బాల్ చాంపి యన్‌షిప్ పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనున్నాయి. కార్యక్రమంలో జిల్లా క్రీడాల అధికారి మీనారెడ్డి, షూటింగ్‌బాల్ ఆసోసియోషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గురువేందర్, హెచ్‌డబ్ల్యుఓ, పీడీలు, పీఈటీలు రాకేష్, రాజశేఖర్, యాదగిరి, ప్రభాకర్, లక్ష్మి, జ్ఞానేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సీతారాం

తిర్యాణి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం అన్నారు. మండలంలోని జెండాగూడ, భీంజిగూడ, గిన్నెధరి, పంగిడి మాదర, చెలిమెల ఆశ్రమ పాఠశాలలు, గిరిజన గురుకుల పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

భూములకు పట్టాలివ్వాలని వినతి

బెజ్జూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నసిద్దాపూర్ శివారులో 761, 762సర్వే నంబర్లలో రైతులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని శుక్రవా రం ఆ గ్రామ రైతులు తమసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. తహసీల్దార్ రామ్మోహన్ మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్‌కు విన్నవిస్తామని తెలిపారు.

పీఎం జుగాను సద్వినియోగం చేసుకోవాలి

జైనూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం జుగా పథకాన్ని గ్రామీణులు సద్విని యోగం చేసుకోవాలని మార్లవాయి మాజీ సర్పంచ్ కనక ప్రతిభ కోరారు. స్థానిక గ్రామ పంచాయతీలో శుక్రవారం గ్రామస్థులకు పీఎం జుగాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మనోజ్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

కెరమెరి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని బీజేపీ మండల అధ్యక్షులు సెడ్మకీ తుకారాం అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలపై మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం కార్యాచరణ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బానోత్ వెంకట్ నాయక్, శ్రీకాంత్ రవిందర్, ఉత్తం, గంగారాం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అప్పగింత

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లోని పార్సిగుట్టకు చెందిన బాలుడు ఇంట్లో నుంచి వెళ్లి ట్రైన్‌లో వస్తుండగా రైల్వే పోలీసులు గుర్తించి శుక్రవారం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు డీసీపీవో మహేష్ తెలిపారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్, కౌన్సిలర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేపట్టిన సంక్షేమ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు, హౌసింగ్‌శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణాలు, ఏకరూప దుస్తుల పంపిణీ ఇతర పనులను త్వరగా చేపట్టాలని ఇంజనీరింగ్, విద్యశాఖ అధికారులను ఆదేశించి పర్యవేక్షించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యార్థం సకల సదుపాయాలు కలిపించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు. వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా శాఖల వారిగా మొక్కలు నాటేందుకు నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పనులు 100 శాతం మొదలు పెట్టాలని సూచించారు. ఇందిరమ్మ లబ్ధిదారులకు మహిళ సంఘాల నుంచి రుణాలు అందించాలని చెప్పారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఉచితంగా ఇసుకను అందిస్తుందని తెలిపారు. గ్రామపంచాయతీలలో పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం చేపట్టాలని, దోమల వృద్ధిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో దత్తరావు, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి నదీం, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యూడైస్ పోర్టల్‌లో నమోదు చేయాలి..

కళాశాల విద్యార్థుల వివరాలను యూడైస్ పోర్టల్‌లో నమోదు చేయాలని జిల్లా అద నపు కలెక్టర్, ఇన్‌చార్జీ డీఈవో దీపక్ తివారి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో 44 జూనియర్ కళాశాలల్లోని ప్రథమ, ద్వితీయ, ఒకేషనల్ విద్యార్థుల వివరాలను యూడైస్ పోర్టల్ లో నమోదు చేయాలని చెప్పారు. సాంకేతిక పరమైన సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించుకోవాలని తెలిపారు. ప్రతి కళాశాలలో ఫేస్ రికగ్నైజేషన్ సిస్టంను 100 శాతం పూర్తి చేయాలన్నారు. విద్యార్థుల హాజరు ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేశామని అన్నారు. సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి పనులు పూర్తి చేయాలని తెలిపారు.

గ్రామస్థులు కుల వివక్ష చూపడం సరికాదు



వివరాలు తెలుసుకుంటున్న కమిటీ సభ్యులు

వాంకిడి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నబెండార గ్రామంలో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్ ఇగరపు లక్ష్మిపై గ్రామస్థులు కుల వివక్ష చూపుతున్న విషయం వాస్తవమేనని, ఇది సరికాదని ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రేగుంట కేశవరావు, మహోల్‌కార్ అశోక్, గోపాల్ నాయక్, దుర్గం శ్యాంరావు, ఇగరపు గణేష్ అన్నారు. కమిటీ సభ్యులు చిన్నబెండార గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. అంగన్‌వాడీ టీచర్ ఇగరపు లక్ష్మిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ దళిత మహిళ అయిన లక్ష్మి గ్రామానికి అంగన్‌వాడీ టీచర్‌గా ఐదేళ్ల క్రితం వచ్చిందని అలన్నారు. అప్పటి నుంచి ఆమెపై గ్రామస్థులు కుల వివక్షత చూపు తున్నారన్నారు. గ్రామంలో మొత్తం బీసీ కులస్థులు మాత్రమే ఉన్నారని అన్నారు. గ్రామస్థులు తన పట్ల వివక్షత చూపుతున్న పట్టించుకోకుండా తనపని తాను చేసుకుంటు పోతుందని చెప్పారు. గత కొన్ని రోజుల నుంచి ఆమె వండి పెడుతున్న పౌష్టికాహాన్ని తినకుండా బహిష్కరిస్తున్నారని వారు తెలిపారు. గ్రామంలో నిర్మించిన ఆంజనేయ ఆలయం పనుల కోసం వచ్చిన కూలీలు, మేస్త్రీల కోసం అంగన్‌వాడీ కేంద్రంలోని ఒక గదిని ఇవ్వాలని గ్రామస్థులు కోరగా అంగన్‌వాడీ టీచర్ నిరాకరించడంతో తాళాలు పగల గొట్టి కూలీలను అందులో ఉంచారని వారు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్‌పై గ్రామస్థులు కులవివక్ష చూపుతున్న విషయాన్ని తహసీల్దార్, సీఐకి తెలియ చేశామని అన్నారు. ఉన్నతాధికారులదృష్టికి తీసుకువెళ్లి గ్రామంలో కుల వివక్ష లేకుండా అధికారులు చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని తెలిపారు.

విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి

సిర్పూర్(యు), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి):గిరిజన గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని పాములవాడ వీటీడీఏ చైర్మన్ పెందొర్ శంకర్ కోరారు. శుక్రవారం మండలంలోని పాములవాడ మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు టైలు,బెల్టులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే అన్ని రంగల అభివృద్ధి ముడిపడి ఉందన్నారు.. తల్లిదండ్రులు తమ పిల్లలు క్రమం తప్పకుండా పాఠశాలలకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివి లక్ష్యం చేరుకోవాలని పెందోర్ శంకర్ సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సోయం దేవ్‌రావు, యూత్ అధ్యక్షుడు ఆత్రం బల్వంత్‌రావు, అంగన్‌వాడీ మెస్రం టీకబాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ

కౌటాల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌటి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన కత్తెరసాల జనార్దన్ అనే వ్యక్తి టై, బెల్టు ఐడీ కార్డులను అందించినట్టు పాఠశాల ఉపాధ్యాయులు సాయి కిరణ్ తెలిపారు. పాఠశాలలో చదివే విద్యార్థులు పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తున్నప్పటికీ విద్యార్థుల్లో ఆసక్తి పెంచేందుకు ఉపాధ్యాయుడు సాయి కిరణ్ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినట్టు, దీనికి స్పందించి కత్తెరసాల జానార్ధన్ తమవంతు సహకరించారని తెలిపారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

ఆసిఫాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ నాయకుడు కృష్ణామాచారి కోరారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న డేలీవేజ్, కాంటినిజెంట్ వర్కర్స్‌ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వర్కర్స్ యూనియన్ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట నిరవధిక సమ్మెను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రభాకర్, వసంత్‌రావు, శ్యాంరావు, రాంబాయి, కోటయ్య పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలి

జైనూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా భిల్లు తండాలో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని, అధికారులు వెంటనే పునరుద్ధరించాని మాజీ సర్పంచ్ ఆడె శంకర్ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కరెంట్ లేనందున తాగు నీటి సరఫరా నిలిచి పోయిందని చెప్పారు. ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

పలు చోట్ల ముస్లింల ర్యాలీ



ఆసిఫాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

ఆసిఫాబాద్‌రూరల్/కాగజ్‌నగర్/సిర్పూర్(టి), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం ముస్లింల మిలాద్ ఉన్ నబీ వేడుకలను పురస్కరించుకుని పట్టణంలోని జామ మజీద్ నుంరి ప్రదాన వీదుల గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం మజీద్‌లో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఆలీబీన్ అహ్మద్, జామ మజీద్ అధ్యక్షుడు అబ్దుల్ ఫయాజ్, ఉస్మానీయ మజీద్ అధ్యక్షుడు అహ్మద్‌బీన్ అబ్దుల్లా, నాయకులు రహెమాన్, తారీక్, సాజిద్, షబ్బీర్, శంషాద్, జావిద్, ఆహ్మద్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలో శుక్రవారం ముస్లింలు మిలాద్ ఉన్ నబి ర్యాలీ నిర్వహించారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం జమా మసీదు నుంచి ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్సీ దండే విఠల్ ఆధ్వర్యంలో ముస్లింలకు స్వీట్లు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ర్యాలీలో పాల్గొన్ని పాలు, అరటిపండ్లను పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో చల్లటి పానీయాలను అందజేశారు. డీఎస్పీ వహిదొద్దీన్, సిఐ ప్రేంకుమార్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు. సిర్పూరు(టి) మండల కేంద్రంలో ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఈద్గా మైదానంలో ముస్లిం లకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బస్టాండు ఏరియాలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప వర్గీయులు ముస్లింలకు అరటిపండ్లు, జ్యూస్ పంపిణీ చేశారు. డౌన్‌లో బీఆర్‌ఎస్ నాయకులు అస్లాం బీన్ అబ్దుల్ల ఆధ్వర్యంలో జ్యూస్ పంపిణీ చేశారు. సీఐ సంతోష్ కుమార్, ఎస్సై కమలాకర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

రేపు గ్రామసభలు

లింగాపూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో ఆదివారం ఉపాధిహామీ పనుల తనిఖీ గ్రామసభలు నిర్వహిస్తామని ఎస్ఆర్‌పీ రవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 ఎప్రిల్ నుంచి 2025 మార్చి 31 వరకు మండలంలో రూ. 4కోట్ల 11 లక్షలతో చేపట్టిన 238 పను ల పై గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందా లు పర్యవేక్షిస్తాయని పేర్కొన్నారు. సోమవారం మండలకేంద్రంలో ప్రజావేదిక ఉంటుందని తెలిపారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

సిర్పూర్(యు), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదర్శ పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. సిర్పూర్(యు) లింగాపూర్, జైనూర్ మండలాల జీవశాస్త్రం, భౌతిక శాస్త్రం బోధించే ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎంఈవో కుడ్మేత సుధాకర్ మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న విషయాలను తరగతి గదిలో అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌పీలు సాగర్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.